# ఈరోజు

సంపుటి 3 సంచిక 234 | హైదరాబాద్, అక్టోబరు 04 బుధవారం 2023 | 4 పేజీలు | వెల : 2.00


## కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలోకి మరో ఇద్దరు

**హైదరాబాద్ :** కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలోకి మరో ఇద్దరు నేతలకు పార్టీ చోటు కల్పించింది. మైనార్టీ వర్గం నుంచి షబ్బీర్ అలీ, ఎస్టీ సామాజిక వర్గం నుంచి బలరాం నాయక్ లను నియమించారు. ఇప్పటికే బీసీ వర్గం నుంచి మధు యాష్కీ , ఎస్సీ సామాజిక వర్గం నుంచి భట్టి విక్రమార్క కమిటీలో ఉన్నారు. వీరితోపాటు పీసీసీ చీఫ్ రేవంత్, ఎంపీ లు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు కమిటీలో కొనసాగుతున్నారు.



# కేసీఆర్.. మీది రాజరికమా!

## కేటీఆర్‌ను సీఎం చేసేందుకు నా ఆశీర్వాదం కోరారు

## అది ప్రజలు నిర్ణయిస్తారని చెప్పా



నిజామాబాద్: ఎన్డీఏలో చేరతానని సీఎం కేసీఆర్ వెంటపడ్డారు.. కానీ ఆ ప్రతిపాదనను తాను ఒప్పుకోలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన జనగర్జన సభలో మోదీ మాట్లాడుతూ.. ' ఎన్నికల తర్వాత కేసీఆర్ ఢిల్లీ వచ్చి కలిశారు. తెలంగాణ పాలన పగ్గాలు మంత్రి కేటీఆర్‌కు ఇస్తానని కేసీఆర్ చెప్పారు. కేటీఆర్‌ను ఆశీర్వదించాలని కేసీఆర్ కోరారు. ఇది రాజరికం కాదు.. ప్రజాస్వామ్యమని కేసీఆర్‌తో చెప్పా. మీరేమైనా రాజులా అని నేను ప్రశ్నించా. ప్రజలు ఆశీర్వదిస్తేనే పాలకులు అవుతారని చెప్పా. బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోబోమని కేసీఆర్‌కు తేల్చి చెప్పా. నాటి నుంచి నా కళ్లలోకి చూడ్డానికి కూడా సీఎం కేసీఆర్ భయపడుతున్నాడు" అని మోదీ హెచ్చరించారు..

**అవసరం తీరాక కేసీఆర్ ప్రవర్తన మారింది..**

కేసీఆర్ గతంలో హైదరాబాద్‌ఎన్నికలపుడు నాతో అప్యాయంగా ఉన్నాడు. ఆర్భాటంగా స్వాగతం పలికాడని ప్రధాని మోదీ అన్నారు. "ఇప్పుడేమైంది? మా అవసరం తీరాక ఆయన ప్రవర్తన మారిపోయింది. మా కార్యకర్తలను ఎన్ని రకాలుగా వేధించినా భయపడేది లేదు. తెలంగాణను ఓ కుటుంబం దోచుకుంటోంది. ఎంతోమంది బలిదానాలతోనే తెలంగాణ సాకారమైంది. తెలంగాణ వచ్చాక ఒక కుటుంబమే బాగుపడింది. కేసీఆర్ పాలనలో అవినీతి పెరిగింది. కేసీఆర్, ఆయన కుమారుడు... ఆయన కుమార్తె, అల్లుడు మాత్రమే ధనికులయ్యారు. కేంద్రం ఇచ్చిన నిధులనూ బీఆర్ఎస్ దోచుకుంటోంది. కుటుంబ పాలనకు ప్రజలు మరో అవకాశం ఇవ్వొద్దు. కేసీఆర్ కుటుంబ సభ్యులంతా దోపిడీ చేస్తున్నారు. ఉద్యోగాల్లో అసలైన యువతకు అవకాశం రావడం లేదు. నమ్మకం ఉంచి టి.బీజేపీకి అవకాశం ఇవ్వండి. బీఆర్ఎస్ దోచుకున్నదంతా కక్కిస్తా" అని మోదీ పేర్కొన్నారు.

**వాళ్లిద్దరూ తెరచాటు ఒప్పందాలు చేసుకున్నారు..**

తెలంగాణ ప్రజల్లో చాలా టాలెంట్ ఉంది. కరోనాకు మందు కనిపెట్టారని మోదీ చెప్పారు.

# కేసీఆర్ ఫైటర్..

## మీలాంటి ఛీటర్లతో ఎన్నటికీ చేతులు కలపరు..

## ప్రధాని మోదీపై మంత్రి కేటీఆర్ ఫైర్



హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ఎన్డీయేలో చేరేందుకు కేసీఆర్ ప్రయత్నించారని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఖండించారు. కేసీఆర్ ఒక ఫైటర్ అని చీటర్లతో ఎన్నటికీ చేతులు కలపరని స్పష్టం చేశారు. ఎన్డీయేతో చేరాల్సిన ఖర్మ తమకు లేదని తెలిపారు. ఎన్డీయేలో చేరేందుకు తమకు పిచ్చికుక్క కరిచిందా అని ప్రశ్నించారు. అది మునిగిపోయే నావ అని.. ఇప్పటికే అన్ని పార్టీలు వీడిపోతున్నాయని అన్నారు. శివసేన, జేడీయూ, తెలుగుదేశం, శిరోమణి అకాలీదళ్ పార్టీలు వెళ్లిపోయాయని అన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ తప్ప ఎన్డీయేలో ఎవరు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇప్పట్నుంచి ప్రధాని మోదీని ఎవరైనా కలిస్తే.. ఒక వీడియో కెమెరా పెట్టుకుని ఆయనతో మాట్లాడే ప్రతి మాట రికార్డు చేసుకుంటే మంచిదేమో అని తనకు అనిపిస్తుందని విమర్శించారు. ఏ రాష్ట్రానికి వెళ్లినా ఒకేరకంగా మాట్లాడటం మోదీకి అలవాటు అయిపోయిందని అన్నారు. 'బెంగాల్ పోతారు.. మమతా బెనర్జీ దేశంలోనే అత్యంత కరప్టెడ్ చీఫ్ మినిస్టర్ అని మాట్లాడతారు. ఒడిశాకు వస్తారు. నవీన్ పట్నాయక్ దేశంలోనే అత్యంత అవినీతిమయమైన ముఖ్యమంత్రి అని అంటారు. మేఘాలయ వెళ్తారు.. అక్కడేమో.. మళ్లీ సాంగ్మా దేశంలోనే కరప్టెడ్ సీఎం అని అంటారు. సరిగ్గా వారం రోజుల తర్వాత ఆయన ప్రమాణస్వీకారంలో ఈయన పార్టీ కూడా చేరుతుంది. ఇద్దరూ కలిసి గవర్నమెంట్ ఏర్పాటు చేస్తారు.' అని అన్నారు. ప్రధాని మోదీ పచ్చి అబద్ధాలకోరు అని మంత్రి కేటీఆర్ అన్నారు.

(మిగతా 2లో..)

## నేపాల్‌లో వరుస భూకంపాలు.. ఢిల్లీలోనూ ప్రకంపనలు



న్యూఢిల్లీ : నేపాల్‌లో వరుసగా రెండుసార్లు భూమి కంపించింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలోనూ ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. మంగళవారం మధ్యాహ్నం 2.25 గంటలకు, 2.51గంటల భూకంపాలు రాగా, రిక్టర్ స్కేలుపై భూప్రకంపనలు వరుసగా 4.6, 6.2గా నమోదయ్యాయి. నిమిషాల వ్యవధిలోనే రెండు భూంకపాలు రావడం గమనార్హం. భూమికి ఐదు కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఢిల్లీ, ఎన్సిఆర్ పరిధితో పాటు యుపిలోని లక్నో, హాపూర్, అమ్రోహాలో కూడా ప్రకంపనలు వచ్చినట్లు సమాచారం. ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపించినట్లు అధికారులు తెలిపారు.

# చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా

## సోమవారం విచారిస్తామన్న సుప్రీంకోర్టు

## బాబు తరపున ముగ్గురు అడ్వోకేట్ల వాదనలు

## సీఐడీ తరపున ముకుల్ రోహత్గీ ఆర్గ్యుమెంట్స్



**ఈరోజు ప్రతినిధి:**

టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. ఇవాళ విచారణ జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసు విచారణ జరిపింది. హైకోర్టుకు అందించిన పత్రాలన్నీ సోమవారంలోపు సమర్పించాలని

(మిగతా 2లో..)

## రెండు, మూడు రోజుల్లో ఎలక్షన్ షెడ్యూల్..




హైదరాబాద్,: రాష్ట్రంలో ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 6 తర్వాత 10తేదీలోగా ఎప్పుడైనా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేయనుందని విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం పథకాలు, హామీల జోరు పెంచింది. పెండింగ్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లను ప్రకటిస్తున్న సర్కార్ ఉద్యోగులకు పీఆర్సీ కమిటీని, ఐఆర్‌ను ప్రకటించింది. అంగన్‌వాడీలను పీఆర్సీ పరిధిలో చేర్చింది. ఈ రెండు మూడు రోజుల్లో మరిన్ని కీలక నిర్ణయాలను, వరాలను గుప్పించేందుకు సీఎం కేసీఆర్ ఉద్యుక్తులవుతున్నారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభమైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం రాక ప్రాధాన్యత సంతరించుకోగా ప్రభుత్వ వేగం కూడా ఎన్నికల షెడ్యూల్ త్వరతగతిని రుజువు చేస్తున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల మూడు రోజుల పర్యటన ముగిసిన వెంటనే ఈ బృందం కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించనుంది.

## కొత్తగా మరో మూడు మండలాలు..

హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా మరో మూడు మండలాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ప్రైమరీ నోటిఫికేషన్ జారీ చేసింది. పదిహేను రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించి.. ఆ తర్వాత తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నది. కొత్త మండలాలు నిర్మల్ జిల్లాలో రెండు ఏర్పాటు చేయబోతుండగా.. వనపర్తి జిల్లాలో ఒకటి ఏర్పాటు చేయబోతున్నది. వనపర్తి జిల్లా ఏదుల మండలాన్ని ఎనిమిది గ్రామాలతో ప్రతిపాదించింది. ఇందులో చిన్నారం, చీరకపల్లి, ఏదుల, సింగాయిపల్లి, తుర్కదిన్నె, మాచుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, రేకుపల్లి గ్రామాలను కలుపుతూ మండలంగా ఏర్పాటు చేయనున్నది. నిర్మల్ జిల్లాలో ప్రభుత్వం మాలెగావ్, బెల్తారోడాను మండలాలుగా ఏర్పాటు చేయనున్నది. ఈ మేరకు ప్రైమరీ నోటిఫికేషన్ జారీ చేసింది. సన్వాలి, వాయి, లింగి, సౌనా, హంపోలి(బి), మోలా, అంతర్ని, పంగ్రా, గొడ్సెర, సొనారి, నిఘ్వా, మాలేగావ్, గోదాపూర్, కుప్టి, వర్ని గ్రామాలను కలుపుతూ మాలేగావ్ మండలాన్ని ప్రతిపాదించింది. ఇక బెల్తాడోరా మండలాన్ని 12 గ్రామాలను కలుపుతూ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. ఇందులో ఝరి (కే), వాజ్హారి, బోల్తారోడా, భోసి, మహాలింగి, బమిని, బండోరత్, బోస్లా, ఝరి (బుజుర్గ్), ఉమ్రీ (ఖుర్ద్), బోరేగావ్ (ఖుర్ద్), బెంబెర గ్రామాలను కలుపుతూ మండలంగా ప్రతిపాదించింది.

# కేసీఆర్ ఫైటర్..

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్రంలోని నాలుగైదు ఏండ్ల చిన్న పిల్లలు కూడా నమ్మని పచ్చి అబద్దాలు చెప్పి ఆయన ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలా బాధకరం.. శోశనీయమని అన్నారు.

**అప్పుడు రాజులు-యువరాజులు గుర్తుకురాలేదా?**

ప్రధాని మోదీ సెలెక్టెవ్ అమ్నేషియాతో బాధపడుతున్నారని.. ఆయనతో ఉంటే మంచోళ్లని.. అన్ని కన్వినెంట్‌గా మరిచి పోతారని మంత్రి కేటీఆర్ విమర్శించారు. 'ప్రకాశ్‌సింగ్ బాదల్ సీఎంగా.. ఆయన కొడుకు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు ఎన్డీఏలో ఉండొచ్చు. అప్పుడు రాజులు- యువరాజులు గుర్తుకురారు. ముఫ్తీ మహమ్మద్ సయ్యద్ కూతురు మెహబూబా ముఫ్తీ పీడీపీ పార్టీతో పొత్తు పెట్టుకున్నప్పుడు కూడా రాజులు యువరాణులు గుర్తుకురారు. నిన్నకాక మొన్న ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సీఎంగా.. లోకేశ్ కేబినెట్ మంత్రిగా ఎన్డీఏలో ఉన్నప్పుడు రాజులు - యువరాజులు గుర్తుకురారు. బాల్ ఠాక్రే కొడుకు ఉద్ధవ్ ఠాక్రే శివసేనతో అంటగాగినప్పుడు కూడా రాజులు - యువరాజులు, వారసత్వం గుర్తుకు రారు. జనతాదళ్ సెక్యూలర్ (జేడీఎస్)కు చెందిన దేవెగౌడ కొడుకు కుమారస్వామి నిన్నగాక మొన్న ఎన్డీఏలో చేరారు. మరి అప్పుడు ప్రజాస్వామ్యం, రాజులు-యువరాజులు గుర్తుకురాలేదా?' అని ప్రశ్నించారు. మీకు పనికొచ్చినప్పుడు ఒకలా.. పనికిరానప్పుడు మరొకలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమనేది ప్రధానమంత్రే ఆలోచించుకోవాలని సూచించారు.

**మోదీకి ఆస్కార్ కూడా వస్తుంది!**

ప్రధాని మోదీ పచ్చి అబద్ధాలకోరు అని.. బీజేపీ ఈజ్ కాల్డ్ బిగ్గెస్ట్ ఝూట్ పార్టీ, బిగ్గెస్ట్ జుమ్లా పార్టీ ఇన్ ఇండియా అని విమర్శించారు. మోదీ గొప్ప స్టోరీ టెల్లర్, స్టోరీ రైటర్ అని.. ఆయన స్క్రిప్టులు రాసుకోవడం మంచిదని అన్నారు. మోదీ యాక్టింగ్, స్క్రిప్ట్ రైటింగ్‌కు ఆస్కార్ కూడా వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ నోటికొచ్చింది మాట్లాడుతున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకసారేమో కర్ణాటకలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ డబ్బులు ఇచ్చిందని అంటారు. మరోసారేమో.. ఎన్డీఏలో చేరేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తే.. తాను అనుమతించలేదని మాట్లాడతారు. ఎన్డీఏలో చేరేందుకు మాకేమైనా పిచ్చి కుక్క కరిచిందా అని ప్రశ్నించారు. అన్ని పార్టీలు ఎన్డీయేను విడిచి వెళ్తున్నాయి. శివసేన మిమ్మల్ని విడిచివెళ్లిపోయింది. జేడీయూ, తెలుగుదేశం పార్టీలు వెళ్లిపోయాయి. శిరోమణి అకాలీదళ్ వెళ్లిపోయింది. మీతో ఎవరు ఉన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ తప్ప ఎన్డీఏలో ఎవరు ఉన్నారు. ప్రధాని మోదీ అనుకుంటారు.. తను చాలా పవిత్రమైన వ్యక్తి అని.. ప్రపంచంలో మిగిలిన వాళ్లంతా అవినీతి పరులని అనుకుంటారు. ప్రధానికి ఒక్కటి గుర్తు చేయాలని అనుకుంటున్నా.. హేమంత్ బిశ్వాస్ శర్మపై ఉన్న కేసు ఏమైంది? మీ పార్టీలో చేరగానే కేసు మాయమైపోయిందా? సీఎం రమేశ్, సుజనా చౌదరిపై ఈడీ, సీబీఐ ఐటీ దాడులు జరిగాయి కదా.. ఆ కేసులు ఏమైపోయాయి? నారాయణ్ రాణే, జ్యోతిరాదిత్య సింధియాపై కేసులు ఏమయ్యాయి? మీతో కలిసిన తర్వాత వాళ్లపై పెట్టిన కేసులు ఏమైపోయాయి?

**ఢిల్లీ గులాములం కాదు.. గుజరాత్ బానిసలం కాదు**

వారసత్వం, కుటుంబ రాజకీయాలపై ప్రధాని మోదీ చేసిన ఆరోపణలపైన కూడా మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'అనురాగ్ ఠాకూర్ ఎవరు? దుమాల్ కొడుకు కాదా?.. జ్యోతిరాదిత్య సింధియా ఎవరు? మాదవరావు కొడుకు కాదా?.. జైషా ఎవరు? క్రికెటరా? కోచా? బీసీసీఐ జనరల్ సెక్రటరీ ఎలా చేశారు?' అని ప్రశ్నించారు. మాట్లాడేముందు ఆలోచించుకోవాలని హితవు పలికారు. 'కేసీఆర్ ఒక ఫైటర్.. చీటర్లతోఎన్నటికీ చేతులు కలపరు. ఎన్డీయేతో చేరాల్సిన ఖర్మ మాకులేదు. అది మునిగిపోయే నావ. కేసీఆర్ ఎప్పుడు కూడా మీలాంటి నాయకులు, మీలాంటి పార్టీతో చేతులు కలపరు. వేం ఢిల్లీకి గులాములం కాదు. వేం గుజరాత్ గులాములం కాదు.' అని స్పష్టం చేశారు.

**మీ పర్మిషన్ ఎందుకు?**

నన్ను ముఖ్యమంత్రిని చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రధాని మోదీ దగ్గరకు వెళ్లి పర్మిషన్ అడిగారని అన్నారు. మా పార్టీలో నిర్ణయాలు తీసుకోవాలంటే వేమే తీసుకుంటాం.. మీ దగ్గర పర్మిషన్ తీసుకోవాల్సిన అవసరం ఏముంది? అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మీరు ఎన్ని అబద్ధాలు.. మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో బీజేపీకి 105 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతయ్యాయని.. ఈసారి 110 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమని తెలిపారు. ఒక్క ఎంపీ స్థానంలో కూడా గెలవలేరని సవాలు విసిరారు. బీజేపీ, నడ్డా, మోదీ, అమిత్ షా ఇంకా ఎంతమందైనా నాయకులు తెలంగాణకు వచ్చి ప్రచారం చేసుకోవచ్చని.. టూరిస్టులకు వెల్‌కమ్ అని చెప్పారు. ఈ తొమ్మిదేండ్లలో తెలంగాణకు ఏం చేశారో ప్రజలకు తెలుసు. మీరు ఇచ్చింది గుండు సున్నా.. మీకొచ్చేది గుండు సున్నానే అని అన్నారు. 'రాహుల్ గాంధీ వచ్చి మేం బీజేపీకి బీ టీమ్ అని అంటారు.. మోదీ వచ్చి కర్ణాకటలో కాంగ్రెస్‌కు పైసల్ పంపినం అని అంటారు. మేం కాంగ్రెస్‌కు పైసల్ పంపుతుంటే మీ ఐటీ టీమ్ ఏం చేస్తుంది?' అని ప్రశ్నించారు. ఈ పిచ్చి మాటలు, ఊకదంపుడు ఉపన్యాసాలతో బెదిరిపోతామని అనుకుంటున్నారేమో. ఆత్మాభిమానం ఉన్న తెలంగాణ బిడ్డలం.. ఢిల్లీ గులాములు.. గుజరాతీ బానిసలం కాదు.. కచ్చితంగా కొట్లాడతాం. చివరిదాకా నిలబడి తలబడతాం. ప్రజాక్షేత్రంలోనే మీతో పోరాడతాం. అని స్పష్టం చేశారు.

## చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై
# విచారణ వాయిదా

**(మొదటి పేజీ తరువాయి)**

సీఐడీ తరపు న్యాయవాదిని సుప్రీంకోర్టు ఆదేశించింది. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సీఐడీ తరపున సుప్రీం సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదించారు.

**17ఏ సెక్షన్ వర్తిస్తుందా? లేదా? అన్నదే ప్రధానం: హరీశ్ సాల్వే**

చంద్రబాబు తరఫు న్యాయవాది హరీశ్ స్వాలే వాదనలు వినిపిస్తూ రాజకీయ ప్రతీకార చర్యలు నివారించడానికి సెక్షన్ 17ఏ తీసుకొచ్చారని, ఈ కేసులో ఆ సెక్షన్ వర్తిస్తుందా? లేదా? అన్నదే ప్రధానమన్నారు. ఆరోపణలు ఎప్పటివనేది కాదని.. కేసు నమోదు, విచారణ ఎప్పుడన్నదే చర్చించాల్సిన అంశమని చెప్పారు. అనంతరం అభిషేక్ సింఘ్వీ వాదించారు. అవినీతి నిరోధక చట్ట సవరణలో ప్రతి పదం సునిశితంగా పరిశీలించి నిర్ధారించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. క్యాబినెట్ నిర్ణయాలకు సీఎం ఒక్కరే బాధ్యులు కాలేరని, ఆ నిర్ణయాలు అధికార నిర్వహణలో భాగమని పేర్కొన్నారు. అధికార నిర్వహణలో తీసుకున్న నిర్ణయాలపై ప్రతీకార చర్యల నుంచి 17ఏ రక్షణ కల్పిస్తుందని వివరించారు. యశ్వంత్ సిన్హా కేసులో కోర్టు తీర్పు ఈ కేసుకు వర్తిస్తుందని తెలిపారు.

**2017లోనే కేసు మూలాలు: ముకుల్ రోహత్గీ**

ఆ తర్వాత సీఐడీ తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 2018 జులైలో చట్ట సవరణ వచ్చిందని 2021లో ఎఫ్ఐఆర్ నమోదైందని చెప్పారు. 2017లోనే కేసు మూలాలు ఉన్నందున 17ఏ వర్తించదన్నారు. కేసు విచారణ ముందే జరిగిందనడానికి ఆధారాలు, పత్రాలు ఏమైనా ఉన్నాయా? అని జస్టిస్ అనిరుద్ధ బోస్ ప్రశ్నించారు. దీనిపై రోహత్గీ స్పందిస్తూ 10% ప్రభుత్వం సంస్థ, 90% ప్రైవేటు సంస్థ పేరుతో రూ.వందల కోట్ల దుర్వినియోగం జరిగిందన్నారు. కేసు మెరిట్స్‌పై చర్చ జరగట్లేదని.. ఆ వివరాల్లోకి వెళ్లొద్దని రోహత్గీకి జస్టిస్ అనిరుద్ధ బోస్ సూచించారు. పిటిషనర్ కౌంటర్ కూడా వేయలేదని రోహత్గీ కోర్టుకు తెలిపారు. ఈ దశలో సిద్ధార్థ లూథ్రా కలుగజేసుకుని కోర్టుకు అన్ని ఆధారాలు సమర్పించామని చెప్పారు. డాక్యుమెంట్లు సమర్పించేందుకు సమయం కావాలని రోహత్గీ కోరారు. మొత్తం కేసు వివరాలతో సిద్ధంగా ఉన్నామని లూథ్రా తెలిపారు. బెయిల్ కోసం వెళ్లకుండా క్వాష్ పిటిషన్‌పైనే వాదిస్తున్నారన్న రోహత్గీ అఫిడవిట్ వేసేందుకు సమయం కావాలని కోరారు. ఈ నేపథ్యంలో వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

# మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్

## జూనియర్లపై సీనియర్ల దాష్టీకం



హైదరాబాద్, : రాష్ట్రంలో మెడికల్ కాలేజీల్లో వరుసగా చోటు చేసుకుంటున్న ర్యాగింగ్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. సీనియర్ విద్యార్థుల వేధింపులు శృతి మించుతుండడంతో ఎంబీబీఎస్ చదువును ఎలా కొనసాగించాలో తెలియక జూనియర్ విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. ర్యాగింగ్‌ను భరించలేక జూనియర్ విద్యార్థులు, ర్యాగింగ్ చేసినందుకు సీనియర్ విద్యార్థులు వైద్య విద్యకు దూరమవ్వాల్సిన పరిస్థితులు మెడికల్ కాలేజీల్లో తరచూ నెలకొంటున్నాయి. ఇటీవల తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్నాయి. కళాశాల యాజమాన్యలు, అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కానరావడం లేదు. దాదాపు 25 రోజుల వ్యవధిలోనే హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీ, వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో తాజాగా ఇప్పుడు మహబూబాబాద్ వైద్య కళాశాలలో ఇలా మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇవి కేవలం ఫిర్యాదు దాకా వచ్చిన ర్యాగింగ్ ఘటనలు మాత్రమేనని, ఫిర్యాదు చేయకుండా సీనియర్ల ర్యాగింగ్ వేధింపులను జూనియర్ విద్యార్థులు భరిస్తూ వస్తున్న ఘటనలు ఎన్నో ఉన్నట్లు తెలుస్తోంది. డాక్టర్ కావాలన్న జీవితాశయంతో కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు పొంది మెడికల్ కాలేజీలోకి అడుగుపెట్టిన జూనియర్ వైద్య విద్యార్థుల ఆశలను ర్యాగింగ్ భూతం చిదిమేస్తోంది. అయితే ఫిర్యాదు దాకా రాని రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో మరికొన్ని కాలేజీల్లో కూడా ర్యాగింగ్ ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. అయితే అవి ఫిర్యాదు వరకు రావడం లేదని ఆ వర్గాలు తెలిపాయి. కొద్ది రోజుల క్రితం గాంధీ మెడికల్ కాలేజీలో సీనియర్ విద్యార్థులు హాస్టల్‌లో మొదటి ఏడాది విద్యార్థులను ర్యాగింగ్ చేశారు. ఈ ఘటనపై వారు జాతీయ వైద్య కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. ఎన్ఎంసీ ఆదేశాలతో స్పందించిన సర్కారు వెంటనే యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపించింది. ర్యాగింగ్‌కు పదిమంది సీనియర్ విద్యార్థులను బాధ్యులుగా గుర్తించి ఏడాది పాటు సస్పెండ్ చేశారు. ఆ ఘటన మరవకముందే వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో మరో ర్యాగింగ్ అంశం తెరపైకి వచ్చింది. కాలేజీ హాస్టల్‌లో ఓ జూనియర్ విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనపై యాంటీ ర్యాగింగ్ కమిటీ రంగంలోకి దిగి విచారణ జరిపింది. ఏడుగురు విద్యార్థులపై వేటు పడింది. జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడిన మహబూబాబాద్ వైద్య కళాశాలలోని ఏడుగురు విద్యార్థులను హాస్టల్ నుంచి బహిష్కరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఈ నెల 21న ఏడుగురు ఎంబీబీఎస్ రెండో సంవత్సంర విద్యార్థులు గదిలోకి తీసుకెళ్లి సార్ అని పిలవాలంటూ అసభ్యంగా ప్రవర్తిస్తూ ర్యాగింగ్ చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు యాంటీ ర్యాగింగ్ కమిటీతో విచారణ జరిపించి, కమిటీ నివేదిక ఆధారంగా తల్లిదండ్రుల సమక్షంలో మందలించారు. మొదటి తప్పుగా భావించి ఆ ఏడుగురు విద్యార్థుల హాస్టల్ వసతిని రద్దు చేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో చోటుచేసుకున్న వరుస ర్యాగింగ్ ఘటనలపై చర్యలు తీసుకుంటున్నా మళ్లీ మళ్లీ పునరావృతం అవుతుండడంతో తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మరింత అప్రమత్తమైంది. మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని వైద్య విద్య ఉన్నతాధికారులను మంత్రి హరీష్‌రావు ఇప్పటికే ఆదేశించారు. ఈ నేపథ్యంలో ర్యాగింగ్ ఘటనలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు తెలంగాణ వైద్యఆరోగ్యశాఖ సిద్ధమవుతోంది.

# 20 మందితో బీఎస్పీ ఫస్ట్ లిస్ట్




- విడుదల చేసిన బీఎస్పీ జాతీయ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్
- సిర్పూర్ కాగజ్ నగర్ నుంచి ఆర్ఎస్పీ పోటీ

**ఈరోజు ప్రతినిధి:**

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను తెలంగాణ బీఎస్పీ ప్రకటించింది. 20 మందితో కూడిన తొలి జాబితాను బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ వెల్లడించారు. తెలంగాణ బీఎస్పీ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సిర్పూర్ కాగజ్ నగర్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగనున్నట్లు రాంజీ గౌతమ్ ప్రకటించారు. మిగతా 99 సెగ్మెంట్లలో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసేందుకు పార్టీ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

1. డాక్టర్ ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్ – సిర్పూర్(జనరల్)
2. జంగం గోపి– జహీరాబాద్ (ఎస్సీ)
3. దాసరి ఉష– పెద్దపల్లి (జనరల్)
4. చంద్రశేఖర్ ముదిరాజ్– తాండూరు (జనరల్)
5. వెంకటేశ్ చౌహన్– దేవరకొండ (ఎస్టీ)
6. కొంకటి శేఖర్ –చొప్పదండి (ఎస్సీ)
7. అలిక వెంకటేశ్వర్ రావు –పాలేరు (జనరల్)
8. మేడి ప్రియదర్శిని– నకిరేకల్ (ఎస్సీ)
9. బానోతు రాంబాబు– వైరా (ఎస్టీ)
10. నక్కా విజయ్ కుమార్–ధర్మపురి (ఎస్సీ)
11. నాగమణి –వనపర్తి (జనరల్)
12. నిషాని రాంచందర్– మానకొండూర్ (ఎస్సీ)
13. పిల్లుట్ల శ్రీనివాస్– కోదాడ (జనరల్)
14. కొత్తపల్లి కుమార్ – నాగర్ కర్నూల్ (జనరల్)
15. బన్సీలాల్ రాథోడ్–ఖానాపూర్ (ఎస్టీ)
16. జానయ్య యాదవ్– సూర్యాపేట (జనరల్)
17. గోర్లకాడి క్రాంతికుమార్ –వికారాబాద్ (ఎస్సీ)
18. ఎర్ర కామేశ్–కొత్తగూడెం (జనరల్)
19. ముప్పారపు ప్రకాశం– ఆందోల్ (ఎస్సీ)
20. ప్రద్యకుమార్ మాధవరావు –జుక్కల్ (ఎస్సీ)

## ప్రతి పంచాయతీకి క్రీడ ప్రాంగణంతో పాటు స్పోర్ట్స్ కిట్టు పంపిణీ



వైరా డివిజన్ అక్టోబర్ 03 ఈరోజు ప్రతినిధి: సింగరేణి మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు తెలంగాణ ప్రభుత్వం ప్రతి పంచాయతీకి క్రీడ ప్రాంగణం, స్పోర్ట్స్ కిట్టు పంపిణీ కార్యక్రమం ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి పంచాయతీకి క్రీడ మైదానం ఏర్పాటు చేయడంతో పాటు క్రీడా సామాగ్రిని ప్రతి గ్రామపంచాయతీ సర్పంచులకు అందించడం జరిగిందని అన్నారు. గ్రామస్థాయిలో యువతకు స్పోర్ట్స్ కిట్టు అందించడం ద్వారా క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని యువత జాతీయ నేషనల్ స్థాయిలో బహుమతులు సాధించడం సులభతరం అవుతుందని గ్రామ మైదానంలో ప్రాక్టీస్ చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించుకోవడం సులభతరం అవుతుందని క్రీడల ద్వారా శారీరక దృఢత్వం పెరుగుతుందని మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎమ్మార్వో సురేష్ కుమార్, కారేపల్లి ఎస్సై రామారావు,సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, అడ్డగోడ ఐలయ్య,ఎంఈఓ శ్రీనివాస్, జడ్పీటీసి జగన్ నాయక్ గ్రామ పంచాయితీల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ కార్యాలయం ముట్టడి

## మా పోడు భూములు మాకే ఇవ్వాలి... న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా



చర్ల, అక్టోబర్ 3, ఈరోజు ప్రతినిధి: : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కార్యాలయం ముందు మంగళవారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. 1986 నుండి పోడు కొట్టుకొని సాగు చేసుకుంటున్న భూములను ఫారెస్ట్ అధికారులు గుంజుకుని అక్రమంగా నిర్బంధాలకు గురిచేసి కేసుల పాలైన మాకు భూములు లేకుండా చేశారని, తక్షణమే ఆ భూములను తిరిగి మాకు అప్పగించాలని, కోరుతూ ఈ రోజు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చర్ల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ చర్ల దుమ్ముగూడెం సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడుతూ 1986లో పోడుకోట్టుకొని అనేక నిర్బంధాలు ఎదుర్కొని కేసులపాలై రక్తం చిందించిన ఆ భూముల్ని ఈ రోజు చర్ల మండలం లింగాల కాలనీకి చెందిన వాసులకి కాదని, వేరే వాళ్ళ పట్టా చేయించుకోవడాన్ని నిరసిస్తున్నాం తక్షణమే ఆ భూముల్ని లింగాలకాలనీ ఆదివాసీలైన పేద ప్రజలకు ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కోరుతుందని తెలిపారు. కలివేరు గ్రామపంచాయతీ లింగాల కాలనీకి చెందిన ప్రజలు రాజకీయంగా ఆర్థికంగా, సాంస్కృతికంగా వెనకబడినటువంటి ప్రజల వారికి రెక్కాడితే డొక్కాడే పరిస్థితి ఉందని అలాంటిది వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని అక్కడ ఉన్నటువంటి కొంతమంది బడా లీడర్లు మాయమాటలతో లింగాల కాలనీ ప్రజలను మీకు పోడుభూములకు పట్టాలిప్పిస్తామని నమ్మించి వాళ్ళదగ్గర ఉన్న కేస్ కాగితాలు తీసుకోని, ఆ భూములను వారి పేరు మీద పట్టాలు చేపించుకొని ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆ భూములు ఎవరైతే మొదట పోడు కొట్టుకున్నారో వారికే ఇవ్వాలని తాహసిల్దార్ కి విన్నవించుకుంటున్నారు. అట్టి భూములపై సర్వే నిర్వహించి లింగాల కాలనీ ప్రజలకు పట్టాలిప్పించాలని, అక్రమంగా పట్టాలు చేపించుకున్న వారిపై చట్టరీత్యచర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ భరణి బాబుకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ మండల నాయకులు సిరిగిడి నరేష్, బొర్ర సమ్మక్క, సప్కా నాగలక్ష్మి, అలవాల రవణ, భద్రమ్మ, బాయమ్మ, లక్ష్మి, శ్రీలత, సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాశాఖ అధికారి తనిఖీ



వైరా డివిజన్ అక్టోబర్ 03 ఈరోజు ప్రతినిధి: సింగరేణి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి రవిబాబు బాబు ఆకస్మిమికంగా సందర్శించారు. కళాశాల రికార్డు లను, స్టాఫ్ హాజరు రిజిస్టర్ లను, విద్యార్థుల హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన ఫలితాలు, పర్సంటేజ్ శాతాన్ని పెంచాలని కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం సూచించారు. కళాశాలలో సింహాచలం అధ్యక్షతన లెక్చరర్లకు సమావేశం ఏర్పాటు చేయగాకళాశాలకు ఎంసెట్ మెటీరియల్ కళాశాలకు పంపిస్తామని విద్యార్థులకు తరగతులు రెగ్యులర్ గా తీసుకోవాలి అని, స్టడీ హవర్స్ ప్రతిరోజు నిర్వహించాలని సైన్స్ విద్యార్థులు కు ప్రాక్టీకల్స్ నిర్వహించాలని అని చెప్పారు. జిల్లా జూనియర్ కళాశాలలో సింగరేణి జూనియర్ కళాశాల ప్రథమ స్థానంలో నిలవాలని ఆదేపాకులకు సూచిస్తూ విద్యార్థుల యొక్క క్రమశిక్షణతో పాటు విద్యార్థత మెరుగు ఉండాలని అప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపల్ మీటకోటి సింహాచలం, దుర్గ ప్రసాద్, అధ్యాపకులు వనిత, రమ, కవిత ,కృష్ణవేణి,, పార్థసారథి యాకయ్య, లక్ష్మీనారాయణ ,రాంబాబు, బాబురావు ఖాసిం,బోదనేది పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడానికి చేతకాకనే గృహలక్ష్మి పథకం అని కొత్త నాటకానికి తెర తీసిన కేసీఆర్: సూరంశెట్టి కిషోర్



మధిర అక్టోబర్ 03 ఈరోజు ప్రతినిధి: మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురంశెట్టి కిషోర్ మాట్లాడుతూ...కేసీఆర్ ప్రభూత్వం ఐదు సంవత్సరాల క్రితం ఎలక్షన్ల మేనిఫెస్టోలో గృహ నిర్మాణానికి మూడు లక్షల ఇస్తా అని చెప్పి ఇవ్వకుండా ఎలక్షన్ ముందు ఇవ్వడంలో మతలబు ఏంటి అని ప్రశ్నించారు.. ఆర్భాటంగా ఇస్తున్నారు ఇవి వచ్చేవేనా? హౌసింగ్ డిపార్ట్మెంట్ లేకుండా చేశారు ఈ గృహలక్ష్మి ఇళ్ల డబ్బులు ఎవరు ఇస్తారు.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఐదు లక్షలతో ఇల్లు ఇస్తామని ప్రకటన వెలువడిన వెంటనే అది తట్టుకోలేక తూతూ మంత్రంగా ఈరోజు గృహలక్ష్మి పేరుతో పత్రాలు మంజూరు చేశారు.. అవి ఇంట్లో ఫ్రేమ్ కట్టించుకోవటానికి తప్ప దేనికి ఉపయోగపడవు, గృహలక్ష్మి ఇల్లు ఒక్కొక్క మండలానికి 3,000 మంది అప్లై చేసుకుంటే 450 ఇల్లు ఇచ్చి మమ అనిపించారు, ఇవన్నీ ఎలక్షన్ జిమ్మిక్కులే.. లేకుంటే నెలరోజుల ముందు గుర్తొచ్చిందా.. 9 సంవత్సరాలుగా పేదలకు ఇల్లు ఇవ్వకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేస్తుంది ఇదంతా ప్రజలు గమనిస్తున్నారు.. గృహలక్ష్మి పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు అందరు మీకు ఆ పత్రాలు అందించిన నాయకులకు ముందు ఇల్లు కట్టుకోవటానికి పెట్టుబడి పెట్టమని చెప్పండి. తర్వాత ఆ బిల్లును వాళ్ళను తీసుకోమని చెప్పండి అప్పుడు తెలుస్తుంది వాళ్లకు గృహలక్ష్మి బిల్లు వచ్చేది రానిది.. కాంగ్రెస్ ప్రభుత్వంలో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా కొన్ని ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటే ఫైనల్ బిల్ సమయములో ఎలక్షన్ కోడ్ వస్తే ఇదే బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలుగా పెండింగ్ బిల్లు ఇవ్వలేదు.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడానికి చేతకాకనే గృహలక్ష్మి పథకం అని కొత్త నాటకానికి కేసీఆర్ తెరతీశాడని, తొమ్మిది సంవత్సరాలుగా పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తానని చెప్పి మోసం చేసి ఇప్పుడు కొత్తగా గృహలక్ష్మి పథకం అని పేదల బతుకులతో కెసిఆర్ ప్రభుత్వం ఆడుకుంటుందని అన్నారు.. ఈ సమావేశం లో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు మండల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు చిలువేరు బుచ్చి రామయ్య, పట్టణ ఐఎన్టీయూసీ అధ్యక్షుడు షేక్ బాజీ,సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ జహంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పారుపల్లి విజయ్ కుమార్, నిడమనూరి వంశీకృష్ణ,బోల్లెద్దు రాజేంద్ర, ఆదిమూలం శ్రీనివాసరావు, షేక్ గౌసుద్దీన్ పాల్గొన్నారు.

## గిరిజన సంఘం ,సిపిఎం ఆధ్వర్యంలో ఇల్లందు యూనియన్ బ్యాంక్ ను ముట్టడించిన హక్కుపత్రాలు కలిగిన పోడు రైతులు




వైరా డివిజన్ అక్టోబర్ 03 ఈరోజు ప్రతినిధి: వైరా నియోజకవర్గ ఇన్చార్జి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలో యూనియన్ బ్యాంక్ ముట్టడి కార్యక్రమం ఈ కార్యక్రమంలో వీరభద్ర మాట్లాడుతూ పోడు రైతులకు గతంలో బ్యాంకు రుణాలు ఇవ్వమని తిరస్కరించిన బ్యాంక్ అధికారులు తీరు మార్చుకోవాలని,ఆందోళన ఫలితంగా పోడు రైతులందరికీ రుణాలు ఇస్తామని ఆమె ఇవ్వడం జరిగిందని,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆదేశాలతో అంగీకరించిన బ్యాంక్ మేనేజర్.గిరిజన సంఘం సిపిఎం పార్టీ పోరాట ఫలితమే పోడు రైతులకు రుణాలు ఇవ్వడానికి అంగీకరించారని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిపిఎం వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్యా వీరభద్రం అన్నారు.బ్యాంకు ముట్టడి ధర్నాలో పాల్గొన్న చీమలపాడు ప్రాంత వందలాది మంది రైతులు తమ నిరసనను వ్యక్తం చేశారు. రైతుల సమస్యను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కేవలం ఓటు బ్యాంకుకే వాడుకుంటున్నారని కనీసం రైతుల పక్షాన న్యాయపోరాటానికి ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా ఇంతవరకు పోరాడలేదని రైతుల పక్షాన గిరిజన సంఘం సిపిఎం పార్టీ పోరాడుతుందని రైతులు గుర్తుంచుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల పక్షాన న్యాయపోరాటానికి గిరిజన సంఘం సిద్ధమైందని ఇల్లందు యూనియన్ బ్యాంకు యందు రైతులు తక్కువ పాత్రలు కలిగి ఉండి పోడు రైతులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు ఇక్కడి చెయ్యగా సానుకూలంగా స్పందించారని అన్నారు.రైతులకు అండగా నిలబడ్డ సిపిఎం ,గిరిజన సంఘం నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు, కె నరేంద్ర ,వజ్జా రామారావు, ధరావత్ సైదులు నాయక్ ,భానోత్ భావ్ సింగ్ నాయక్, మాలోతు రాంకోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో నిలబెట్టుకున్నాం... తెలంగాణలోనూ నిలబెట్టుకుంటాం: పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం అక్టోబర్ 03 ఈరోజు ప్రతినిధి: ప్రజలకు ఏం కావాలో వాళ్లు ఏం కోరుకుంటున్నారో కాంగ్రెస్ పార్టీకి బాగా తెలుసు వారి ఆకాంక్షలకనుగుణంగానే హామీలిస్తాం.వాటిని అధికారంలోకి వచ్చాక చేసి చూపుతాం. కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకున్నాం. తెలంగాణలోనూ అధికారం వచ్చాక ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకుంటామని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్, ఎన్నికల కమిటీ సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలంలోని సీతారామఫంక్షన్ హాల్లో జరిగిన మండల పార్టీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత మండల పర్యటనకు విచ్చేసిన పొంగులేటికి బైక్ ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అనేక హామీలిచ్చామని ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నామని తెలిపారు. ఇళ్లు లేని ఎంతోమంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. ఇప్పుడు కూడా ఆరు గ్యారంటీలు ఇచ్చామని అధికారమొచ్చాక వాటిని అమలు చేసి చూపుతామని పేర్కొన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని పార్టీలోని ప్రతి నాయకుడికి, కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇంకో ఆరవై రోజులు కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకువస్తే తమతో పాటు తమను నమ్ముకున్న ప్రతిఒక్కరికి న్యాయం జరుగుతుందని సూచించారు. సోనియమ్మ ప్రకటించిన ఆరుగ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్క కార్యకర్తపై ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పొంగులేటితో పాటు పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, సర్పంచ్ లు బచ్చలకూర జ్యోతి, కోంద్రు విజయలక్ష్మి, రామకృష్ణ, మాగి పుల్లయ్య, ఈపూరి సుజాత, ఎంపీటీసీ లు ఉసిరికాయల లక్ష్మయ్య, కట్టెకోల సుధాకర్, మాజీ జెడ్పీటీసీ లు మీసా ముత్తయ్య, కుక్కల హనుమంతరావు, సీనియర్ నాయకులు చాగంటి నారాయణ, ఆరెకట్ల గురవయ్య, దండా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ లక్కం ఏడుకొండలు, వార్డు మెంబర్లు బుజ్జిమళ్ల హైమవతి, నిమ్మగడ్డ గౌరి, పి. నాగిరెడ్డి, వాకా బేబి, చిదుముల మానస, చిలకల సీతారావమ్మ, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, చెర్వు స్వర్ణ, వాకా శ్రీనాథ్, మామిడి వెంకన్న, జాన్ రెడ్డి, రాయపూడి నారాయణ రావు, శ్రీను, ముక్కంటి, కన్నయ్య, రామరావు, మోహన్ రెడ్డి, లక్ష్మినారాయణ, శ్రీనివాసరావు, సైదులు, వాసు, కన్నా రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రీడా పోటీలకు లూర్దు మాత విద్యార్థులు ఎంపిక..



తల్లాడ, అక్టోబర్ 3 : ఈరోజు ప్రతినిధి: లూర్దు మాత విద్యాలయం విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జస్సింత మేరీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏన్కూరు లో జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో తమ పిల్లలు అత్యుత్తమ ప్రతిభ చాటారని ముఖ్యంగా సీనియర్స్ వాలీబాల్ విభాగంలో ఎస్ అక్షయ బాబు, టి మణిబాబు, సిహెచ్ భార్గవ్ ,అండర్ 14 విభాగంలో అబ్బాయిల విభాగంలో లూర్దురెడ్డి, అండర్ 14 ఖొఖొ అమ్మాయిలో నందిని అండర్ 17 అమ్మాయిలు దీపిక, అండర్ 17 అబ్బాయిలలో రణధీర్, పార్థు, కృష్ణకుమార్ అదేవిధంగా రన్నింగ్ లో భార్గవ్ ఎంపికైనట్లు ఆమె తెలిపారు ఈ యొక్క గొప్ప ఘనత మా పాఠశాలకి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పి ఈ టి చలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 35వ రోజు ఇంటింటి ప్రచారం కొనసాగించిన గొంగళ్ల రంజిత్ కుమార్



గద్వాల అక్టోబర్ 03ఈరోజు ప్రతినిధి: పట్టణం లో 35వ రోజు షేరెలి వీధి రాజవీధి కాలనీ లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో గద్వాల నియోజకవర్గం నుండి పోటీ చేస్తామని ఈ సందర్భంగా గద్వాల ప్రజలు అవకాశం ఇచ్చి గద్వాల కోటపైన బహుజన జెండాను ఎగరేయటానికి ప్రతి ఒక్కరూ కృషిచేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

## లకింపూర్ కేరి రైతుల విలేఖరి మరణానికి కారణమైన ఆసీస్ మిశ్రను మంత్రివర్గం నుండి తొలగించాలని అక్టోబర్ 03న బ్లాక్ డే



ఖమ్మం అక్టోబర్ 03 ఈరోజు ప్రతినిధి: సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం ఇచ్చిన పిలుపులో భాగంగా అఖిలపక్షరైతు సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం కొత్త బస్టాండ్ సెంటర్లో మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలియజేసి బ్లాక్ డే నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్, రాష్ట్ర నాయకులు ఎం రాజేంద్రప్రసాద్ ఎస్కే కాసిం మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మోడీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా వ్రాసి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రైతులపై పెట్టిన అన్ని రకాల కేసులను ఎత్తివేయాలని ఎం ఎస్ పి పంటల గిట్టుబాటు ధర చట్టం అమలు చేయాలని ఉద్యమంలో అమరులైన 7 00 ప్రతి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్రేసియా చెల్లించాలని ,నలుగురు రైతుల, ఒక విలేఖరి మరణానికి కారణమైన మంత్రి కొడుకు అజయ్ మిశ్రను కఠినంగా శిక్షించాలని మాట్లాడుతూ నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐకే మిస్ జిల్లా నాయకులు శీలం సుదర్శన్, పీ మోహన్ రావు ,వై జానకి ,ఉమామహేశ్వరరావు ,ఎస్కే కాసిం ,బడే జాన్ రెడ్డి ,తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఇల్లందు ఏరియా ఏజీఎం ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జర్పుల ధోని నాయక్



వైరా డివిజన్ అక్టోబర్ 03 ఈరోజు ప్రతినిధి: నూతనంగా ఇల్లందు సింగరేణి ఏరియా ఏజీఎం బాధ్యతలు తీసుకున్న నరసింహా రాజ్ ని పోలంపల్లి యువ నేత, కాంగ్రెస్ నాయకులు జర్పుల ధోని నాయక్ మర్యాద పూర్యకంగా కలిసి సన్మానం చేశారు.ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి విషయాలను ఏజీఎంతో చర్చించారు. ఈ సందర్భంగా ధోని నాయక్ ప్రత్యేకంగా పోలంపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధి కై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి గ్రామ అభివృద్ధి చేయాలనీ కోరారు. సోలార్ పవర్ ప్లాంట్ నుండి మెయిన్ రోడ్ లో వీధిలైట్లను పోలంపల్లి బైపాస్ రోడ్డు వరకు ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది .అదేవిధంగా అతి త్వరలోనే 15 మెగా విద్యుత్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా మా గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువకులను , ల్యాండ్ లోజర్ కు, గ్రామ యువతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో దగ్గరలో ఉన్న పవర్ ప్లాంట్ లోనైనా కనీసం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తద్వారా యువతకు మేలు చేసే విధంగా సమస్త ఉపయోగపడుతుందని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం నరసింహ రాజ్, గ్రామ నాయకులు ధోని నాయక్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి 5 శాతం ప్రకటించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్ అక్టోబర్ 03ఈరోజు ప్రతినిధి: తెలంగాణలోని ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురును వినిపించింది. ఉద్యోగులకు పే స్కేల్ చెల్లింపు కోసం పే రివిజన్ కమిటీని,పీఆర్సీని, నియమించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు.ఈ మేరకు కమిటీ చైర్మన్గా ఎన్ శివశంకర్,రిటైర్డ్ ఐఎఎన్,, సభ్యుడిగా బీ రామయ్య,రిటైర్డ్ ఐఏఎస్,సీఎం కేసీఆర్ నియమించారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఆరు నెల్లలోపు నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఉత్తర్వుల్లో సూచించింది.పీఆర్సీకి బాధ్యతలు నిర్వర్తించేందుకు కావాల్సిన నిధులను, సిబ్బందిని సమకూర్చాలని ఆర్థిక శాఖను ఆదేశించింది.5శాతం మధ్యంతర భృతి ఐఆర్,ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది..

ఈరోజు
సంపాదకీయం
బుధవారం 04, అక్టోబరు 2023

## తెలంగాణ.. విధ్వంసం నుంచి వికాసం వైపు

75 ఏండ్ల స్వతంత్ర భారతం సాధించిన ప్రగతి గణనీయమైనదే అయినా, ఆశించిన లక్ష్యాలను, చేరవలసిన గమ్యాలను మాత్రం ఇంకా చేరలేదనే చెప్పాలి. ప్రకృతి ప్రసాదించిన వనరులు, కష్టించి పనిచేసే ప్రజలు ఉన్నప్పటికీ పాలకుల అసమర్థత, భావదారిద్ర్యం ఫలితంగా వనరుల సద్వినియోగం జరగడంలేదు. అన్నీ ఉండి కూడా ప్రజలు అకారణంగా అవస్థలు అనుభవిస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, బలహీనవర్గాల జీవితాల్లో అలుముకొన్న పేదరికం ఇప్పటికీ తొలగిపోలేదు. వనరులను సంపూర్ణంగా వినియోగించుకొని ప్రగతి ఫలాలు అన్నివర్గాల అభ్యున్నతికి సమానంగా ఉపయోగపడిన నాడే సాధించుకున్న స్వాతంత్ర్యానికి సార్థకత.దేశ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో అహింసాయుతంగా, శాంతియుత పంథాలో కేసీఆర్ నేతృత్వం లో మనం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. సమైక్య పాలనలో తెలంగాణలోని అన్నిరంగాలూ విధ్వంస మయ్యాయి. నాటి తెలంగాణ నాయకత్వం సమైక్య నాయకులకు కొమ్ము కాస్తూ రావడం వల్ల తెలంగాణ తీవ్రమైన వివక్షకు, దోపిడీకి గురైంది. తెలంగాణ ప్రజలందరూ ఒక్కతాటిపై నిలిచి చేసిన సుదీర్ఘ ప్రజా ఉద్యమం ఫలితంగా స్వరాష్ట్ర స్వప్నం సాకారమైంది.పది సంవత్సరాల కిందటి తెలంగాణ జీవనచిత్రాన్ని తలుచుకుంటే ఇప్పటికీ గుండెలు పిండేసినట్లయి దుఃఖం తన్నుకొస్తది. ఎటుచూసినా పడావు పడ్డ పొలాలు, పూ డుకపోయి తుమ్మలు మొలిచిన చెరువులు, ఎండిపోయి దుబ్బతేలిన వాగులు, అడుగంటిన భూగర్భ జలాలు, ఎండిపోయిన బావులు, పాతాళం లోతుకు పోయినా సుక్క నీరు కానరాని బోర్లు, ఎడతెగని కరెంటు కోతలు, అప్పుల ఊబిలో చిక్కి ఆశలు సైతం అడుగంటి ఆఖరుకు ఆత్మహత్యలే శరణ్యమైన అన్నదాతలు, బతుకుమీద ఆశ చచ్చి ఉరి పెట్టుకుంటున్న చేనేత కార్మికులు, యువకులం తా వలసెల్లిపోతే ముసలివాళ్లే మిగిలిన పల్లెలు, ఇండ్లకు తాళాలు పడి గడ్డి మొలుస్తున్న గోడలు, మొరం తేలిన వాకిళ్లు, తినడానికి తిండిలేక గంజి కేంద్రాలతో ఆదుకోవాల్సిన గడ్డు పరిస్థితులు.ఇటువంటి పరిస్థితుల నడుమ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ పునర్నిర్మాణాన్ని ఒక పవిత్రయజ్ఞంగా నిర్వహించింది. నిజాయితీతో, నిబద్ధతతో, నిరంతర మేధోమథనంతో అవిశ్రాంతంగా శ్రమించింది. విధ్వంసమైన తెలంగాణను విజయవంతంగా వికాసం వైపు నడిపించారు సీఎం కేసీఆర్. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు ఎరిగిన నాయకుడు కనుక, దానికి అనుగుణంగా అన్నిరంగాలనూ ప్రక్షాళన చేశారు. అనతి కాలంలోనే తిరుగులేని ఫలితాలను సా ధించారు. అనేక రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానం లో నిలబెట్టారు. దార్శనిక దృక్పథంతో, పారదర్శక విధానాలతో, అభివృద్ధిలో, సంక్షేమంలో కొత్త పుంతలు తొక్కించారు.. తెలంగాణ ఆచరిస్తుంది – దేశం అనుసరిస్తుంది. అనే దశకు తెలంగాణను తీసుకొచ్చిన నిత్యకృషీవలుడు కేసీఆర్.నేడు తెలంగాణ జీవన దృశ్యాన్ని చూస్తే.. నిరంతర విద్యుత్తు వెలుగులు, పంట కాలువలతో, పచ్చని చేన్లతో కళకళలాడుతున్నది. మండే ఎండల్లో సైతం చెరువులు మత్తడి దుంకుతున్నయి. వాగులు, వంకలు, వాటిపై నిర్మించిన చెక్ డ్యాములు నీటి గలగలలతో తొణికిసలాడుతున్నాయి. తరలివస్తున్న కాళేశ్వర జలధారలతో గోదావరి సతత జీవధారయై తెలంగాణ భూములను తడుపుతున్నది. ఒకనాడు చుక్క నీటికోసం అలమటించిన తెలంగాణ ఇపుడు ఇరవైకి పైగా రిజర్వాయర్లతో అలరారుతున్నది. మూడు కోట్ల టన్నుల వరిధాన్యం దిగుబడితో నేడు తెలంగాణ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా విలసిల్లుతున్నది. సంక్షేమంలో, అభివృద్ధిలో సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తున్నది. దశాబ్దకాలంలో తెలంగాణ సాధించిన అపూర్వ ప్రగతిని చూసి యావద్దేశం ఆశ్చర్యానికి లోనవుతున్నది. ఈ అద్భుతమైన పురోగమనం ఇదే రీతిన కొనసాగే విధంగా తెలంగాణ ప్రజలు తమ సంపూర్ణమైన ఆశీర్వాద బలాన్ని ఇదే రీతిన రానున్న ఎన్నికల్లో అందించాలని తీర్మానించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పటిష్టమైన క్రమశిక్షణతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసింది. సంపద పెంచింది. ప్రజలకు పంచింది. దేశంలో స్థిరపడిన పెద్ద రాష్ట్రాలను అధిగమించి నూతన రాష్ట్రం తెలంగాణ రూ.3,12,398 తలసరి ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచింది. అదేవిధంగా తలసరి విద్యుత్తు వినియోగంలో జాతీయ సగటు కంటే 1,255 యూనిట్లను అధిగమించింది. దేశ సగటుకంటే 70శాతం అత్యధికంగా 2,126 యూనిట్ల సగటు వినియోగంతో తలసరి విద్యుత్తు వినియోగంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్ర జీఎస్డీపీ 2014లో రూ.4,51,580 కోట్లు. అదే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ వ్యూహాత్మక పాలనా కొనసాగించడంతో 2023 నాటికి రూ.13,13,391 కోట్లు పెరిగింది. అంటే దాదాపు మూడు రెట్లు పెరిగింది. అదే విధంగా తెలంగాణ తలసరి ఆదాయం చూసుకుంటే 2014లో రూ.1,24,104 ఉంటే, అదే తలసరి ఆదాయం 2023లో రూ.3,17,117 లకు పెరిగింది, అంటే అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతున్నది.అదే విధంగా రాష్ట్రం ఏర్పడిన నాడు తెలంగాణ స్థాపిత విద్యుత్ సామర్థ్యం: 2014లో 7,778 మెగావాట్లు. తొమ్మిదేండ్ల పాలన తర్వాత తెలంగాణ రాష్ట్ర స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 2023లో 26,000 మెగావాట్లు. తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 2014లో 13 56 యూనిట్స్‌గా ఉంటే తొమ్మిదేండ్ల పాలనలో 2023 నాటికి 2150 యూనిట్స్‌కు చేరుకున్నది.రాష్ట్రం ఏర్పడే నాటికి వ్యవసాయానికి సాగునీరు 2014లో 62 లక్షల ఎకరాలు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2023లో 135 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనుడు కేసీఆర్. పంటల సాగు విస్తీర్ణం 2014లో 131 లక్షల ఎకరాలు మాత్రమే ఉంటే అది నేడు 2023 లెక్కల ప్రకారం 220 లక్షల ఎకరాలు. ధాన్యం ఉత్పత్తి 2014 నాటికి 68 లక్షల టన్నులైతే రాష్ట్రం ఏర్పడిన తరువాత తొమ్మిదేండ్లకు మూడింతలై 2023 నాటికి 272 లక్షల టన్నులు అయింది. 2014లో ఐటీ పరిశ్రమలో 3,23,396 ఉద్యోగాలు ఉంటే నేడు 9.05.715 ఉద్యోగాలు పెరిగాయి. ఐటీ ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి. నాడు 5 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉంటే నేడు జిల్లాకు ఒక్కటి చొప్పున 33 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసింది ఎంబీ బీఎస్ సీట్లు పెరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో 298 ఉన్న ప్రభుత్వ గురు కులాలు 1005 కు చేరుకున్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న కేసీఆర్ ఈ రోజు ప్రతి ఒక్కరి గుండెల్లో పదిలం గా ఉన్నారు. ప్రతిపక్ష నేతలు చేసే అసత్య ప్రచారాలు నమ్మే స్థితిలో ప్రజ లు లేరు. మూడోసారి కేసీఆర్ ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# కార్పొరేట్ల లాభాల కోసం అడవుల విధ్వంసం




ప్రస్తుతం మన దేశంలో భూ వినియోగం విషయంలో ప్రైవేట్ కార్పొరేట్ల ప్రయోజనాలు సామాజిక ప్రయోజనాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి. ఇప్పుడు రియల్ ఎస్టేట్ మార్కెట్ అవసరాల కోసం, గోల్ఫ్ కోర్సుల కోసం చాలా ఎక్కువమంది పేదలు నివసిస్తున్న భూములను ఖాళీ చేయిస్తున్నారు. స్వల్ప సంఖ్యలో ఉండేవారికోసం అధిక సంఖ్యాకుల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారు.మోడీ ప్రభుత్వం మార్కెట్ అవసరాలకు (కార్పొరేట్ల అవసరాలకు) అనుగుణంగా భూ వినియోగాన్ని మార్చే పనిలో ఉంది. పెట్టుబడి ఆదిమ సంచయంతో ఇటువంటి మార్పులే జరుగుతాయి. భూమితో సహా అన్ని సంపదలూ సమిష్టిగా అనుభవిస్తున్నవిగాని, చిన్న చిన్న యజమానులు అనుభవిస్తున్నవి గాని కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లో చిక్కడమే కాకుండా, ఆ సంపదల వినియోగం తీరు కూడా మారిపోతుంది. చిన్న చిన్న రైతుల చేతుల్లో ఉండే భూమి కాస్తా కొద్దిమంది కార్పొరేట్ల పాలైతే అప్పుడు అక్కడ చిన్న తరహా ఉత్పత్తి విధానం పోయి, భారీ స్థాయి సరుకుల ఉత్పత్తి మొదలౌతుంది.ఈ మోడీ ప్రభుత్వం నిరంతరం కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం పనిచేస్తూ వుంటుంది. ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో, ఇతర రంగాలలో ఉన్న కార్పొరేట్లు ప్రాజెక్టులు చేపట్టి లాభాలను పిండుకోవడం కోసం దేశంలోని విస్తారమైన అటవీ ప్రాంతాలను నాశనం చేయడానికి అనుమతిస్తోంది. అందుకోసం అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు తెస్తోంది. తద్వారా ప్రభుత్వ సంరక్షణలో ఉండే కొన్ని అటవీ ప్రాంతాలను ఇకముందు అడవులుగా పరిగణించకుండా అటవీ సంరక్షణ చట్టం పరిధిలోంచి తొలగించనుంది.1996లో సుప్రీం కోర్టు ఒక తీర్పు వెలువరించింది. దాని ప్రకారం అటవీ ప్రాంతంగా ఉన్న భూమిని, అది ఎవరి స్వాధీనంలో ఉన్నప్పటికీ, దానిని ప్రభుత్వ రికార్డుల్లో అటవీ ప్రాంతంగా నమోదు చేయకపోయినప్పటికీ, ప్రభుత్వం సంరక్షించాల్సిందే. ప్రభుత్వ రికార్డులు అటవీ ప్రాంతాలను నమోదు చేయడంలో ఘోరంగా వెనుకబడ్డాయి. అడవి అనే నిర్వచనమే చాలా అస్పష్టంగా ఉంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంది. అందువలన సుప్రీం కోర్టు ప్రతీ రాష్ట్రంలోనూ ఒక నిపుణుల కమిటీని నియమించాలని, రికార్డుల్లో లేని అన్ని అటవీ ప్రాంతాలనూ గుర్తించాలని, వాటన్నింటికీ అధికారికంగా అటవీ ప్రాంతాలుగా గుర్తింపునివ్వాలని, అప్పుడే వాటిని చట్ట ప్రకారం సంరక్షించడం సాధ్యపడుతుందని ఆ తీర్పులో ఆదేశించింది. ఈ తీర్పు వచ్చిన 18 సంవత్సరాల తర్వాత కూడా, అంటే 2014 నాటికి కూడా హర్యానా, బీహార్, గుజరాత్, మహారాష్ట్ర వంటి పలు రాష్ట్రాల ప్రభుత్వాలు అటవీ ప్రాంతాలను గుర్తించడానికి కాని, వాటిని ప్రభుత్వ రికార్డులలో తగు విధంగా నమోదు చేయడానికి గాని ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు. ఈ సంగతి ఒక పాత్రికేయుల బృందం చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ లొసుగుని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటోంది. ఏకంగా చట్టానికే సవరణలు తెచ్చి రికార్డులకెక్కని అటవీ భూములకు ప్రభుత్వ సంరక్షణ లేకుండా చేస్తోంది.ఇది సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే. నిజానికి కేంద్రం ఇంతవరకూ సుప్రీంకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేసిన రాష్ట్రాలను హెచ్చరించి ఆ తీర్పు అమలు జరిగేలా చూసి వుండాలి. లేదా కేంద్ర ప్రభుత్వమే ఒక నిపుణుల కమిటీని నియమించి అన్ని రాష్ట్రాలలోనూ నమోదు కావలసిన అటవీ ప్రాంతాలను గుర్తించి అవి ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలని ఆ యా రాష్ట్రాలను ఆదేశించి వుండాల్సింది. అలా చేయకపోగా, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వాన్ని సాకుగా తీసుకుని సుప్రీం కోర్టు తీర్పునే రద్దు చేసేలా చట్ట సవరణకు సిద్ధం కావడం మోడీ ప్రభుత్వ తెంపరితనానికి నిదర్శనం.సుప్రీంకోర్టు ఉత్తర్వుల కారణంగా తమ నిర్వహణలో ఉన్న తోటలను కూడా అడవులుగా గుర్తించే అవకాశం ఉందని ప్రైవేటు యజమానులు భయపడుతున్నారని, తమ భూములను తమకు నచ్చిన విధంగా వినియోగించుకునే హక్కు కోల్పోతామని వారు భావిస్తున్నారని, అందువలన ప్రైవేటు తోటల విస్తరణ ఆగిపోయిందని, దాని ఫలితంగా పచ్చదనం దెబ్బ తింటోందని, ప్రైవేటు యజమానుల భయాలను పోగొట్టి పచ్చదనాన్ని విస్తరించడానికే ఈ సవరణ తీసుకువస్తున్నామని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ తమ చర్యను సమర్థించుకున్నారు. ఇది అందరినీ తప్పుదోవ పట్టించే వాదన. మొదటి విషయం: అడవుల, తోటల విస్తీర్ణం పెరగకపోడానికి ఒక కారణాన్ని అది ముందుకు తెచ్చింది. తోటలు పెంచుతున్న, పెంచాలని అనుకుంటున్న ప్రైవేటు యజమానుల మనసుల్లో భయాలు ఏర్పడ్డాయన్నదే ఆ కారణం. అటువంటిది వాస్తవంగా ఉందో, లేదో, ఉంటే ఎక్కడెక్కడ, ఎవరెవరికి ఉందో చెప్పగల గణాంకాలు ప్రభుత్వం దగ్గర ఉండాలి. దానిమీద ఎటువంటి స్వతంత్ర అధ్యయనమూ లేదు, ఆధారాలూ లేవు. రెండవ విషయం: ఒకవేళ ప్రైవేటు యజమానులకు ఆ విధమైన భయాలు నిజంగా ఉన్నా, అడవులకు, తోటలకు మధ్య తేడాను స్పష్టంగా తెలియజెప్పే విధంగా నిర్వచించడమే దానికి పరిష్కారం ఔతుంది. అలా చేయడం పోయి ఏకంగా చట్టాన్నే మార్చేయవలసిన అగత్యం ఏముంది? ఇక్కడ ప్రభుత్వ ఉద్దేశ్యం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అడవీ ప్రాంతాలను సంరక్షించడం కాదు దాని లక్ష్యం. విస్తారమైన అటవీ ప్రాంతాలను వ్యాపారానికి అనువుగా మార్చివేయడమే. అలా గనుక జరిగితే పర్యావరణానికి కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఇప్పటిదాకా, దేశంలో అటవీ భూముల విస్తీర్ణం వాస్తవంగా ఎంత ఉందో ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. అందులో ఎంతవేరకు ఇప్పుడు వ్యాపారానికి అనువుగా మార్చబోతున్నారో అంచనా వేయడం సాధ్యం కావడం లేదు. ఐతే ఈ రంగంలోని నిపుణులు మాత్రం గణనీయమైన అటవీ ప్రాంతాన్ని కోల్పోనున్నామని హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు హర్యానా రాష్ట్ర పరిధిలోకి వచ్చే ఆరావళీ పర్వత శ్రేణికి చెందిన అటవీ ప్రాంతం అధికారికంగా అడవిగా నమోదు కాలేదు. ఆ ప్రాంతం దేశ రాజధానికి దగ్గర్లో ఉంది. అందుచేత ఆ ప్రాంతంమీద చాలామంది రియల్టర్ల కన్ను పడింది. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని వ్యాపారాలకు వినియోగించడం జరిగితే దేశ రాజధాని ప్రాంతంలో అత్యంత ఆవశ్యమైన పచ్చదనం కాస్తా కనుమరుగౌతుంది. పర్యావరణానికి కలిగే అపార నష్టంతోబాటు ఆ అడవుల మీద ఆధారపడి తమ జీవనాన్ని కొనసాగిస్తున్న ప్రజల గతి ఏమౌతుంది? అడవుల్లో చిన్న తరహా అటవీ ఉత్పత్తులను సేకరించి తమ జీవనాన్ని వెళ్ళదీస్తున్నవారు చాలామంది ఉన్నారు. ఆ అడవులు ధ్వంసం అయితే వారి జీవనోపాధి ఏమౌతుంది? వారికి ప్రభుత్వం ఏ ప్రత్యామ్నాయాన్నీ చూపించకుండా అడవులను ధ్వంసం చేయడానికి అనుమతిస్తే అది వారందరి జీవితాలనూ నాశనం చేయడమే ఔతుంది. ఉమ్మడి సంపదను కొందరు కొల్లగొట్టి పోగేసుకునే ''ఆదిమ సంచయం'' ఫలితంగా అనేకుల జీవితాలు విధ్వంసం అవుతాయని మార్క్స్ చెప్పాడు. ఇప్పుడు అదే జరుగుతోంది. పలు దళిత, గిరిజన సంఘాలు మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన చట్ట సవరణను బలంగా వ్యతిరేకించడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. అటవీ భూములను ప్రైవేటీకరించే ఈ ప్రయత్నం ఒక పెద్ద సవాలును ముందుకు తెచ్చింది. అది కేవలం అడవీ భూములకు సంబంధించినదే కాదు, మొత్తం భూమికి సంబంధించినది. మన దేశంలో భూమి కొరత చాలా ఉంది. అంతే కాదు, ఆ కొరతను భర్తీ చేయడం కూడా అసాధ్యం. అటువంటప్పుడు ఆ పరిమితమైన భూమిని ఏ విధంగా వినియోగిస్తున్నారు అనేది ఉపాధి, ఆహార భద్రత, తదితర సామాజిక లక్ష్యాలపై ప్రభావం చూపుతుంది. ఆ లక్ష్యాలను సాధించడంలో భూమి వినియోగం కీలకం ఔతుంది. అందుచే త అటువంటి కీలకమైన భూమి వినియోగాన్ని ప్రైవేటు వ్యక్తుల ఇష్టాలకు వదిలిపెట్టకూడదు. భూమిని మొత్తంగా సమాజపరం చేయలేకపోవచ్చు. కాని భూ వినియోగాన్ని మాత్రం సామాజికంగా నియంత్రించాల్సిందే. వరిసాగులో ఉన్న భూములను ఇతరత్రా వినియోగించడాన్ని నియంత్రిస్తూ కేరళ రాష్ట్రంలో చేసిన చట్టం వెనుక ఉన్న తర్కం ఇదే. దీనర్థం ఏమిటి? ఒకరివద్ద నుండి మరొకరు కొంత భూమిని కొంటున్నప్పుడు ఆ లావాదేవీని అనుమతించాలంటే ఒక షరతు విధించాలి. ఆ భూమి చేతులు మారాక దాని వినియోగం మారితే (పంట పొలంగా ఉన్నది కాస్తా ఇళ్ళ నిర్మాణానికో, ఫ్యాక్టరీ కట్టడానికో ఉపయోగిస్తే) అలా మారిన వినియోగం సమాజానికి ఆమోదయోగ్యంగా ఉండాలి అన్నదే ఆ షరతు. ఈ సూత్రాన్ని అనుసరించే 1996లో సుప్రీం కోర్టు అటవీ భూములను వేరే విధంగా వినియోగించడాన్ని నిరోధిస్తూ తీర్పు చెప్పింది. పర్యావరణ రక్షణ దృష్ట్యా, స్వేచ్ఛా మార్కెట్ (కార్పొరేట్లను) కార్యకలాపాలను నియంత్రించడం అవసరమేనని అందరూ ఒప్పుకుంటారు. కాని మొత్తం సమాజం ప్రయోజనాలను కాపాడాలంటే ప్రైవేట్ కార్పొరేట్ల ప్రయోజనాలను నియంత్రించాల్సిందే అన్న సాధారణ సూత్రంలో ఇదొక అంతర్భాగమేనని అందరూ గమనించాలి. ప్రస్తుతం మన దేశంలో భూ వినియోగం విషయంలో ప్రైవేట్ కార్పొరేట్ల ప్రయోజనాలు సామాజిక ప్రయోజనాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి. ఇప్పుడు రియల్ ఎస్టేట్ మార్కెట్ అవసరాల కోసం, గోల్ఫ్ కోర్సుల కోసం చాలా ఎక్కువమంది పేదలు నివసిస్తున్న భూములను ఖాళీ చేయిస్తున్నారు. స్వల్ప సంఖ్యలో ఉండేవారికోసం అధిక సంఖ్యాకుల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారు. ఇప్పుడు దేశంలో భూ వినియోగాన్ని సామాజిక ప్రయోజనాల దృష్ట్యా నియంత్రించడానికి ఏ విధమైన పద్ధతులను ప్రవేశ పెట్టాలన్న ప్రశ్న మనల్ని వెనక్కి లాగేయకూడదు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మార్కెట్‌లో అమ్మకానికి వచ్చే ఏ భూమినైనా మొదట ఆ కార్పొరేషన్‌కే అమ్మజూపాలి అన్న నిబంధన విధించాలి. అప్పుడు ఆ కార్పొరేషన్ ఆ భూమిని కొని దానిని తిరిగి మరొకరికి అమ్మేటప్పుడు ఆ కొనుగోలుదారులు దాన్ని సామాజికంగా ఆమోదయోగ్యంగా ఉండే విధంగా వినియోగించే షరతును అమలు చేయగలుగుతుంది. లేదా, నేరుగానే ఇద్దరు వ్యక్తుల మధ్య భూ లావాదేవీ జరిగినప్పుడు దానిని కొనేవారు సామాజికంగా ఆమోదయోగ్యమైన రీతిలోనే వినియోగించాలన్న షరతును విధించవచ్చు. ఆ షరతును ఉల్లంఘిస్తే భారీ జరిమానా విధించవచ్చు. ఐతే ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఇందుకు పూర్తి వ్యతిరేక దిశలో అడుగులు వేస్తోంది. మార్కెట్ అవసరాలకు (కార్పొరేట్ల అవసరాలకు) అనుగుణంగా భూ వినియోగాన్ని మార్చే పనిలో ఉంది. పెట్టుబడి ఆదిమ సంచయంతో ఇటువంటి మార్పులే జరుగుతాయి. భూమితో సహా అన్ని సంపదలూ సమిష్టిగా అనుభవిస్తున్నవిగాని, చిన్న చిన్న యజమానులు అనుభ విస్తున్నవి గాని కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లో చిక్కడమే కాకుండా, ఆ సంపదల వినియోగం తీరు కూడా మారి పోతుంది. చిన్న చిన్న రైతుల చేతుల్లో ఉండే భూమి కాస్తా కొద్దిమంది కార్పొరేట్ల పాలైతే అప్పుడు అక్కడ చిన్న తరహా ఉత్పత్తి విధానం పోయి, భారీ స్థాయి సరుకుల ఉత్పత్తి మొదలౌతుంది. నల్ల వ్యవసాయ చట్టాలు ఈ లక్ష్యం కోసమే రూపొందాయి. తమ తమ స్వంత వినియోగం కోసం గాని, ఎఫ్‌సిఐ ద్వారా దేశ ఆహార అవసరాలను తీర్చడం కోసం గాని ప్రధానంగా పంటలు పండించే చిన్న రైతుల నుండి భూమి కార్పొరేట్ల పరం చేసి సంపన్న పెట్టుబడిదారీ దేశాల అవసరాలను తీర్చే వాణిజ్య పంటలు పండించడానికి ఆ చట్టాలు తోడ్పడతాయి. ఇప్పుడు అటవీ సంరక్షణ చట్టానికి చేస్తున్న సవరణ కూడా అటవీ భూముల వినియోగాన్ని మార్చి స్వదేశీ, విదేశీ సంపన్నుల అవసరాల కోసం మళ్ళించడానికే ఉపయోగపడుతుంది. ఆ అడవుల మీద ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులను అడివికి దూరం చేస్తుంది.

## ఉక్తి




రైతు లేని రాజు ఎక్కడా లేడు
రైతుని వంచించని రాజ్యం
ఏ చోట వెతికినా కానరాదు
నాగలి విరిగినప్పుడు
ఈ నేరం నాదేనని ఒప్పుకున్న
రాబందుల నాయకుడు – లేనే లేడు!
పొలాన్నీ పంటనీ నమ్ముకున్నవాడు రైతు
మాయనీ మోసాన్నీ అమ్ముకున్నవాడు
దళారి
రైతు జీవితం రోజురోజుకి బెట్టగొట్టి,
మట్టి గొట్టుక పోతుంటే
సింహాసనం మీద కూర్చున్న
హింస రాజు – రైతు మాంసం తింటూ
మౌనంగా బతుకుతుంటాడు
రైతుకి పనిలో పాటలో
వేన్నీళ్లకి చన్నీళ్లలా రైతు సహచరి
రాజుకి పగలో ప్రతీకారంలో
అగ్నికి ఆజ్యంలా అందాల రాణి
ఎక్కడైనా ఏ స్థల కాలాల్లోనైనా
రైతు సంపద సృష్టికర్త
రాజు షడ్రషోపేత భోక్త
అలంకారికంగా చెప్పాలంటే
రైతు– స్వభావోక్తి
రాజు – అతిశయోక్తి !
రైతు ఎప్పటికీ రాజు కాదుబీ రైతు రైతే !

– రవి నన్నపనేని

## కాంగ్రెస్ లో బీసీలు గ్రూప్

హైదరాబాద్, అక్టోబరు 3, :తెలంగాణ ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో బీసీ నినాదం బలంగా వినిపిస్తోంది. బీసీ ప్రతినిధులుగా చెప్పుకునే వి.హనుమంతరావు, మధుయాష్కీ, పొన్నాల లక్ష్మయ్య లాంటి సీనియర్లు ఈ నినాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. ఇప్పటికే పార్టీలో రేవంత్ వర్గం, రేవంత్ వ్యతిరేక వర్గం అని రెండు గ్రూపులు ఉన్నాయి. తాజాగా బీసీలు ఈ రెండు గ్రూపులకు పోటీగా బీసీ టీంగా ఏర్పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50 సీట్లు ఇవ్వాలని బీసీలు పట్టుపడుతున్నారు. ఈమేరకు టీసీసీసీ చీఫ్‌తోపాటు, కాంగ్రెస్ అధిష్టానంపైగా ఒత్తిడి తెచ్చేప్రయత్నం చేశారు. ఈమేరకు మీడియా ఎదుట తమ వాదాన్ని గట్టిగా వినిపిస్తున్నారు. కానీ, బీసీ నేతల వాదాన్ని అధిష్టానం పెద్దగా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఇటీవలే కర్ణాటక వెళ్లి ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే. శివకుమార్‌ను కలిసి వచ్చారు. బీసీలకు సముచిత ప్రాధాన్యం దక్కేలా చూడాలని విన్నవించారు. తెలంగాణ ఎన్నికలు అంటేనే భారీ ఖర్చుతో కూడుకున్నవి అన్నట్లుగా పరిస్థితి తయారైంది. అధికార పార్టీ చేస్తున్న భారీ ఖర్చు ముందు విపక్షాలు తేలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా ఆర్థికంగా సమాయత్తమవుతున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో అయ్యే ఖర్చు తక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చాలా మంది అసెంబ్లీ బరిలో నిలిచేందుకే ఆసక్తి చూపుతున్నారు. రూ. 50 కోట్లు ఖర్చు చేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవొచ్చనే ఆలోచనలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని లెక్కలు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే మధుయాష్కీ ఈసారి ఎల్‌బీ నగర్ టికెట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. పొన్నాల లక్ష్మయ్య, హనుమంతరావులాంటి నేతలు కూడా అసెంబ్లీ ఎన్నికలే బెటర్ అనుకుంటున్నారు. బీసీ నేతలు వచ్చే ఎన్నికల్లో గెలవక పోయినా పదవులు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల తర్వాత ఎమ్మెల్సీ, రాజ్యసభ టికెట్లతోపాటు, పార్టీలో కీలక పదవులు దక్కే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే బీసీ వాదాన్ని కొంతమంది తెరపైకి తెచ్చి బలంగా వినిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్టానం మాత్రం ఈ బీసీ నినాదాన్ని లైట్ తీసుకుంటున్నట్లే కనిపిస్తోంది.

## గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

**సర్పంచ్ శిల్పా రెడ్డి, గురునాథ్ రెడ్డి**

కౌతాళం:ఈరోజు ప్రతినిధి: బాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది ఈ గ్రామ సభకు ముఖ్య అధ్యక్షత వహించిన సర్పంచ్ శిల్ప రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న డ్రైనేజ్ సమస్యలు అయితేనేమి వీధిలైట్లు, సిసి రోడ్లు మిగతా సమస్యలను త్వరలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి గ్రామాన్ని అభివృద్ధి మరియు సంక్షేమ వైపు కృషీ చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వైసిపి యువ నాయకులు గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి ప్రతి ఒక్క కుటుంబాన్ని సందర్శించి వారి రోగాలను గుర్తించి వారికి ఉచితంగా వైద్య సదుపాయం కల్పించాలని హెచ్చరించారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ అబ్దుల్ వాహీద్, వీఆర్వో రామాంజనేయులు, ఉప సర్పంచ్ రామాంజనేయులు ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, వైసిపి నాయకులు అయ్యప్ప రెడ్డి, రాఘవరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాపరెడ్డి, దేవరెడ్డి, సచివాలయ సిబ్బంది,,అంగన్వాడి ఆయాలు ,ఆశ వర్కర్లు, సచివాలయ కన్వీనర్, గృహ సారథులు, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నల్గొండ కాంగ్రెస్ లో టిక్కెట్ల లొల్లి...

నల్గొండ, అక్టోబరు 3, :ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు ముఖ్య నాయకుల చేరికలతో కాంగ్రెస్ మాంచి ఊపు మీదుంది. రానున్న ఎన్నికల్లో పన్నెండు నియోజకవర్గాలో కనీసం పది తమవే అన్న ధీమాను ఆ పార్టీ కీలక నాయకుల వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో అయిదు చోట్ల మాత్రం సీట్ల సర్దుబాటు పెద్ద సమస్యగా మారనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు ముఖ్య నాయకుల చేరికలతో కాంగ్రెస్ మాంచి ఊపు మీదుంది. రానున్న శాసన సభ ఎన్నికల్లో పన్నెండు నియోజకవర్గాలో కనీసం పది స్థానాలు తమవే అన్న ధీమాను ఆ పార్టీ కీలక నాయకుల వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ ఇంకా తన అభ్యర్థులను ప్రకటించకుండానే మెజారిటీ స్థానాలు తమ ఖాతాలో పడతాయన్న ఆశాభావంలో ఉంది. కానీ, కనీసం అయిదు నియోజకవర్గాల్లో మాత్రం సీట్ల సర్దుబాటు పెద్ద సమస్యగా మారనుంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకుంది. కోదాడ, హుజూర్ నగర్, మిర్యాలగూడెం, నాగార్జున సాగర్, నల్లగొండ, ఎన్నికల పొత్తులో భాగంగా సీపీఐకి తాము ఇచ్చిన మద్దతుతో గెలిచిన దేవరకొండ.. అంటే మొత్తంగా ఆరు చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. బీఆర్ఎస్ మరో ఆరుచోట్ల ఆలేరు, భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, సూర్యాపేట ల్లో గెలవడంతో సమ ఉజ్జీలుగా నిలిచాయి. కానీ, 2018 శాసన సభ ఎన్నికల విషయానికి వచ్చే వరకు కేవలం మూడు నియోజకవర్గాలు మునుగోడు, నకిరేకల్, హుజూర్ నగర్ లకే పరిమితం కావాల్సి వచ్చింది. కానీ, ఈ సారి పరిస్థితి అలా లేదని, తామే అత్యధిక చోట్ల గెలుస్తామని ప్రకటిస్తున్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్న ఆలేరు, నల్లగొండ, నాగార్జున సాగర్, హుజూర్నగర్, కోదాడ , సూర్యాపేట, తుంగతుర్తిలను మినహాయిస్తే.. భువనగిరి, మునుగోడు, దేవరకొండ, మిర్యాలగూడెం, నకిరేకల్, నియోజకవర్గాల్లో సీట్ల సర్దుబాటు సమస్యగా మారనుందన్న అభిప్రాయాన్ని పార్టీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

భువనగిరి :

భువనగిరి నియోజకవర్గంలో పరిస్థితి నిన్నా మొన్నటి వరకు కొంత ఆశాజనకంగానే కనిపించింది. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీరును నిరసిస్తూ డీసీసీ అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేసి, బీఆర్ఎస్ లో చేరిన కుంభం అనిల్ కుమార్ రెడ్డిని తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి తీసకువచ్చారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆశీస్సులతో, టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ద్వారా తిరిగి పార్టీలోకి వచ్చిన కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులు కూడా ఉన్నాయంటున్నారు. ఇన్నాళ్లూ ఎంపీ కోమటిరెడ్డి ప్రోత్సహించిన రామాంజనేయులు గౌడ్, శివరాజ్ గౌడ్, తానే స్వయంగా కండువాకప్పి పార్టీలోకి తీసుకున్న జిట్టా బాలక్రిష్ణారెడ్డి టికెట్ విషయంలో డైలమాలో పడ్డారు. ఇపుడు ఇక్కడ ఎవరికి టికెట్ వచ్చినా మిగిలిన వారు కలిసి పనిచేసే పరిస్థితి లేదు.

మునుగోడు:

మునుగోడు నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ తమ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేసి బీజేపీ లో చేరడం వల్ల వచ్చిన ఉప ఎన్నికల్లో తమ స్థానాన్ని బీఆర్ఎస్ కు కోల్పోయింది. ఉప ఎన్నికల్లో పోటీ చేసిన పాల్వాయి స్రవంతిరెడ్డి తనకే మళ్లీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఉప ఎన్నికల సమయంలోనే తెరపైకి వచ్చిన చలమల్ల క్రిష్ణారెడ్డి టికెట్ రేసులో ఉన్నారు. బీసీ కోటాలో తనకు టికెట్ ఇవ్వాల్సిందేని పున్నకైలాష్ నేత పట్టుబడుతున్నారు. మరో వైపు వామపక్షాలతో ఎన్నకల పొత్తు కుదిరతే సీపీఐ తమకు ఈ సీటును కేటాయించాలని డిమాండ్ చేయనుంది. ఇటీవల ఇంకో కొత్త వార్తా ప్రచారంలోకి వచ్చింది. బీజేపీ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్ గూటికి వస్తారని, ఆయన కానీ, ఆయన భార్య కోమటిరెడ్డి లక్ష్మి కాని పోటీ చేయొచ్చని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారమే నిజమైతే.. ఇంత మంది నాయకుల మధ్య ఐక్యత సాధ్యమయ్యే పనిలా కనిపించడం లేదు.

దేవరకొండ :

దేవరకొండలో 2009 ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్, తన సిట్టింగ్ స్థానాన్ని త్యాగం చేసి ఎన్నికల పొత్తులో భాగంగా 2014 ఎన్నికల్లో సీపీఐకి కేటాయించింది. కాంగ్రెస్ మద్దుతో సీపీఐ గెలిచినా.. ఆ పార్టీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ఆ తర్వాత బీఆర్ఎస్ లోకి వెళ్లిపోయారు. దీంతో 2018 ఎన్నికల్లో తిరిగి రవీంద్ర కుమార్ బీఆర్ఎస్ నుంచి విజయం సాధించారు. కాగా, కాంగ్రెస్ గెలుపు ఆశలు పెట్టుకున్న దేవరొండలో బాలూనాయక్, కిషన్ నాయక్, బిల్యానాయక్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. వీరి మధ్య అనైక్యత బీఆర్ఎస్ కు లాభిస్తుందేమోనన్న ఆందోళన స్థానిక కాంగ్రెస్ కేడర్ లో ఉంది. కానీ, ఈ ముగ్గురు నాయకులను సమన్వయం చేసే నేత కానరావడం లేదు. బిల్యానాయక్ టీడీపీ నుంచి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ లోకి వచ్చిన నాయకుడు. కిషన్ నాయక్ కు ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆశీస్సులతోనే రాజకీయాలు నెరుపుతున్నారు. బాలూనాయక్ సీనియర్ నాయకుడు జానారెడ్డికి అనుచరుడిగా పేరుంది. వీరి మధ్య ఐక్యత కుదిరే అవకాశాలు కనిపించడం లేదన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి.

మిర్యాలగూడెం :

మిర్యాలగూడెం నియోజకవర్గంలో టికెట్ ఎక్కువ పోటీ ఉంది. టీ పీసీసీకి ఇక్కడి నుంచి 18 మంది దరఖాస్తు చేసుకున్నా.. టికెట్ కు ప్రధాన పోటీదారులు మాత్రం బత్తుల లక్ష్మారెడ్డి (బి.ఎల్.ఆర్), కుందూరు రఘువీర్ రెడ్డి మధ్యే ఉండనుంది. కానీ, ఇక్కడ కూడా వామపక్షాలతో పొత్తు కుదరితే ప్రభావం చూపనుంది. కాంగ్రెస్ తో ఎన్నికల పొత్తులో భాగంగా సీపీఎం కోరే సీట్లతో మిర్యాలగూడెం కూడా ఒకటి. ఒక వేళ సీపీఎం కే టికెట్ కేటాయిస్తే.. కాంగ్రెస్ శ్రేణులు ఏమేర సహకరిస్తాయన్నది ప్రశ్నార్థకమేనని చెబుతున్నారు.

నకిరేకల్ :

జిల్లాలో ఇపుడు హాట్ సీట్ నకిరేకల్. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సీట్లు కాంగ్రెస్ గెలిచింది. కానీ, గెలిచిన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గులాబీ తీర్థం పుచ్చుకోవడంలో మూడేళ్లుగా పలువురు నాయకులు పనిచేసుకున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ పై పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఇటీవలే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని టికెట్ రేసులోకి వచ్చారు. ఆయనకు ఈ ఎన్నికల్లో టికెట్ ఇస్తామన్న హామీపైనే పార్టీలో చేరారు. దీంతో ఇప్పటి దాకా టికెట్ పై ఆశలు పెట్టుకున్న దైద రవీందర్, కొండేటి మల్లయ్య, వేదాసు శ్రీధర్ లు ఏమేర కలిసి వస్తారు, ఎంత మేర పార్టీకోసం పనిచేస్తారన్నది ప్రశ్నార్థకమే అని పేర్కొంటున్నారు. ఇలా మొత్తంగా అయిదు నియోజకవర్గాల్లో సీట్ల సర్దుబాటు కాంగ్రెస్ నాయకత్వానికి తలనొప్పిగా మారనుంది.

## పసుపు బోర్డు ప్రకటనతో గ్రాఫ్ పెరిగినట్టేనా..?

నిజామాబాద్, అక్టోబరు 3, :నిజామాబాద్ పసుపు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర పసుపు బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాని మోడీ మహబూబ్‌నగర్ బహిరంగ సభ వేదికగా పసుపు బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నది. తొమ్మిదేండ్ల పాటు అసాధ్యం.. కుదరదు.. అని కేంద్ర మంత్రులు తేల్చి చెప్పగా ఇప్పుడు ఎలా సాధ్యమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయంగా పసుపు బోర్డు అంశాన్ని బీజేపీ వాడదల్చుకున్నదని, దేశవ్యాప్తంగా బీజేపీ గ్రాఫ్ పడిపోతూ ఉండడంతో తెలంగాణ నుంచి ఉన్న నాలుగు ఎంపీ సీట్లను పదిలంగా కాపాడుకునే ఉద్దేశంతోనే మోడీ నోటి ద్వారా ఈ ప్రకటన వచ్చిందన్న మాటలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచీ కేంద్రంపైన ఈ ఒత్తిడి ఉన్నది. అప్పటి వాణిజ్య మంత్రి పసుపు బోర్డు ఏర్పాటు అసాధ్యమంటూ అనేక సందర్భాల్లో తేల్చి చెప్పారు. తొమ్మిదేండ్లుగా అదే విధానం కొనసాగింది. పసుపు బోర్డును ఏర్పాటు చేయకుంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని వంద రూపాయల బాండ్ పేపర్ మీద ఆ నియోజకవర్గ రైతులకు రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. మరో ఎనిమిది నెలల్లో ఆయన పదవీకాలం పూర్తి కావొస్తున్నా ఇప్పటికీ పసుపు బోర్డు హామీని నిలబెట్టుకోలేదు. నిజానికి 2014లో నిజామాబాద్ ఎంపీగా కల్వకుంట్ల కవిత గెలిచిన తర్వాత జూన్ 12న అప్పటి వాణిజ్య మంత్రి నిర్మలా సీతారామన్‌ను స్వయంగా కలిసి పసుపు బోర్డు ఏర్పాటుపై మెమొరాండం ఇచ్చి విజ్ఞప్తి చేశారు. పసుపు రైతుల సంక్షేమంతోపాటు ఆ పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్, నిజామాబాద్ జిల్లాలో పండుతున్న నాణ్యమైన వెరైటీ తదితరాలను పరిగణనలోకి తీసుకుని బోర్డును ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. పరిశోధన ద్వారా మరిన్ని ఫలితాలు ఉంటాయని నొక్కిచెప్పారు. బోర్డు ఏర్పాటు ద్వారా రైతులకు మాత్రమే కాక ఎగుమతిపరంగానూ దేశానికి జరిగే మేలును ఆమె వివరించారు. మసాలా దినుసుల కోసం ఉన్న బోర్డు నుంచి పసుపును విడదీసి ప్రత్యేకంగా బోర్డును నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. రబ్బరు, కొబ్బరి తదితరాలకు బోర్డులు ఉన్నట్లుగానే పసుపు కోసం ప్రత్యేకంగా బోర్డును నెలకొల్పితే పరిశోధనలు జరిగి మేలు రకాలైన పంటను ఉత్పత్తి చేయవచ్చని సూచించారు. ఎంపీగా ఉన్న ఐదేండ్ల పాటు ఈ అంశాన్ని లోక్‌సభలో పలుమార్లు ప్రస్తావించారు. తన ఐదేండ్ల పదవీకాలంలో బోర్డు ఏర్పాటులో విఫలం కావడంతో రైతుల్లో నిరాశా నిస్పృహలు, అసంతృప్తి చివరకు 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఓటమికి కారణమయ్యాయి. దీన్ని పసిగట్టిన బీజేపీ అభ్యర్థి ఎంపీ అరవింద్ ఎన్నికలకు ముందే 2019 మార్చిలోనే బాండ్ పేపర్ ద్వారా రైతులకు హామీ ఇవ్వడం ఆయన గెలుపొందడానికి కారణమైంది. పసుపు బోర్డు ఏర్పాటులో ఆశించిన ఫలితం రాకపోవడం 2019లో కవిత ఓటమికి కారణమైనట్లుగానే ఈసారి ధర్మపురి అర్వింద్ కు చేదు అనుభవం తప్పదని గ్రహించినందునే స్వయంగా ప్రధాని మోడీ తెలంగాణ గడ్డ మీద నుంచి పసుపు బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన చేయాల్సి వచ్చిందన్న చర్చలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి 2021లో రాజ్యసభలో పసుపు బోర్డు అంశాన్ని లేవనెత్తినప్పుడు కూడా కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ కుదరదంటూ తేల్చి చెప్పారు. మరో కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల సైతం పార్లమెంటు వేదికగా దీన్నే నొక్కిచెప్పారు. నిజామాబాద్ ఎంపీగా కవిత ఉన్నప్పుడే ఇక్కడి నుంచి రైతుల్ని ఢిల్లీకి తీసుకెళ్లి అప్పటి వ్యవసాయ మంత్రి రాధా మోహన్ సింగ్‌తోనూ చర్చలు జరిపారు. పసుపు నుంచి వ్యాల్యూ ఎడిషన్ కోసం పరిశ్రమలను స్థాపించడానికి, రైతుల నుంచి నేరుగా పసుపును కొనుగోలు చేయడానికి పతంజలి సంస్థ ప్రతినిధి బాబా రాందేవ్‌తోనూ చర్చించారు. బీఆర్ఎస్ అడిగినప్పుడు ఓకే చెప్పడం ద్వారా బీజేపీకి పొలిటికల్ మైలేజ్ రాదనే ఉద్దేశంతోనే ఇంతకాలం రెడ్ సిగ్నల్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తనంతట తానుగా నెలకొల్పడం ద్వారా గ్రాఫ్ పెంచుకోవచ్చనేది ఈ నిర్ణయం వెనక ఉద్దేశం అనేది బహిరంగ రహస్యం.

# 32 స్థానాల్లో జనసేన పోటీ...



హైదరాబాద్, అక్టోబరు 3, :తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలను జనసేన ప్రకటించింది. మొత్తం 32 స్థానాల్లో జనసేన పోటీ చేయనున్నట్లు జనసేన ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు రేపో, మాపో నోటిఫికేషన్ వస్తుందన్న ప్రచారంతో పార్టీలు అభ్యర్థుల ప్రకటన, ప్రచారాలపై దృష్టిపెట్టాయి. ఈసారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించిన జనసేన.. పోటీ చేసే స్థానాలను ఖరారు చేసింది. తెలంగాణలో మొత్తం 32 స్థానాల్లో జనసేన పోటీ చేయనున్నట్లు వెల్లడించింది. కూకట్‌పల్లి, ఎల్బీనగర్, వైరా, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మునుగోడు, కుత్బుల్లాపూర్, శేర్‌లింగంపల్లి, పటాన్‌చెరు, సనత్‌నగర్, కొత్తగూడెం, ఉప్పల్, అశ్వరావుపేట, పాలకుర్తి, నర్సంపేట, స్టేషన్ ఘన్‌పూర్, హుస్నాబాద్, రామగుండం, జగిత్యాల, నకిరేకల్, హుజూర్‌నగర్, మంథని, కోదాడ, సత్తుపల్లి, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, ఖానాపూర్, మల్కాజిగిరి, మేడ్చల్, పాలేరు, ఇల్లందు, మధిరలో జనసేన పోటీ చేయనున్నట్లు పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న జనసేన స్థానాలను ఆ పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్ రెడ్డి హైదరాబాద్ లో ప్రకటించారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీ అంశంపై పూర్తి సన్నదతతో ఉన్నామని మహేందర్ రెడ్డి అన్నారు. ఈసారి పోటీలో జనసేన ఉంటుందని, ఒకవేళ చివరి క్షణంలో పొత్తులు ఏమైనా ఉంటే స్థానాల్లో మార్పు రావచ్చన్నారు. సింగిల్ గా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గత 10 సంవత్సరాల్లో అనేక సమస్యలపై తెలంగాణలో జనసేన పార్టీ పోరాటం చేసిందన్నారు. నల్లమల యురేనియం తవ్వకాలు, మహిళలపై దాడులు, డ్రగ్స్ సమస్య, ఆర్టీసీ కార్మికుల సమస్య, బీసీ, ఎస్టీ వర్గాల సమస్యలు, విద్యార్థుల సమస్యలు ఇలా అనేక సమస్యలపై జనసేన పార్టీ పోరాటం చేసిందన్నారుతెలంగాణలో జనసేన పార్టీ బలంగా ఉందని మహేందర్ రెడ్డి తెలిపారు. పవన్ కల్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ సానుభూతిపరులు, మెగా అభిమానులు పార్టీకి అండగా నిలబడ్డారన్నారు. 32 నియోజకవర్గాల్లో పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని, పార్టీ బలంగా ఉన్న స్థానాల్లో పవన్ కల్యాణ్ వారాహి యాత్ర చేయనున్నారని ప్రకటించారు. తెలంగాణలో పొత్తుల అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పవన్ కల్యాణ్ సూచనల మేరకు పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో ప్రధానంగా జనసేన పార్టీ పోటీ చేయనుందని మహేందర్ రెడ్డి తెలిపారు. పార్టీ క్యాడర్ బలంగా ఉన్న 32 నియోజకవర్గాల్లో ఇప్పటికే కమిటీలు వేశామని, అక్కడ పార్టీ బలంగా పనిచేస్తుందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ గడ్డపై పార్టీని ఏర్పాటు చేశారని తెలిపారు. గత ఎన్నికల్లో 7 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేశామని, ఈసారి రానున్న ఎన్నికల్లో దాదాపు 32 అసెంబ్లీ స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేయనుందన్నారు.

# మరలా వచ్చేది బిఆర్ఎస్సే: జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు






బోనకల్, అక్టోబర్3 ఈరోజు ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో గెలిచేది బీఆర్ఎస్ అని సీఎం గా కేసీఆర్ కావటం ఖాయమని అందరికీ గృహలక్ష్మి కింద ఇల్లు ఇవ్వటం ఖాయమని, కాంగ్రెస్ వచ్చేది లేదు ఇచ్చేది లేదని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా కళ్యాణ మండపం నందు మంగళవారం మండలంలో గృహలక్ష్మి లబ్ధిదారు లకు మంజూరు పత్రాలను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండ బాల కోటేశ్వరరావు ఎంపీపీ కంకణాల సౌభాగ్యం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కమల్ రాజు, కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటగా సీఎంగా కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని వారు ఎంతమందిని సర్వే చేయగ ఏడు లక్షల మంది తేలారని తెలిపారు. అంతకుముందు పరిపాలన చేసిన కాంగ్రెస్ అందరికీ ఇల్లు ఇస్తే ఏడు లక్షలు ఇల్లు లేని కుటుంబాలు ఎలా ఉన్నాయని వారిని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ఇల్లు అంటే దగా అన్నారు. కాంగ్రెస్ నాయకులు పన్ను వసూలు చేశారని విమర్శించారు. ప్రతి బిల్లుకి పన్ను వసూలు చేశారని విమర్శించారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో హౌసింగ్ బోర్డు మొత్తం అవినీతిమయంలో కూరుక పోయిందని, అందుకే కేసిఆర్ అధికారంలోకి రాగానే హౌసింగ్ బోర్డ్ ను రద్దు చేశారన్నారు. బోనకల్ మండలంలో 3,027 మంది గృహలక్ష్మి కింద దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఇందులో చాలామంది గతంలో బిల్లులు పొందినట్లు ఉన్నాయని అందువలన వారిని తిరస్కరించినట్లు తెలిపారు. మేము అధికారంలోకి వస్తే కాంగ్రెస్ 5 లక్షల ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటిస్తున్నారని వారు అధికారంలోకి వచ్చేది లేదు ఇచ్చేది లేదని మరల అధికారంలోకి వచ్చేది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. బోనకల్లు మండలాన్ని దళిత బంధు కింద ఎంపిక చేస్తున్నట్లు సత్తుపల్లి సభలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రకటించారని తెలిపారు. కానీ కొంతమంది కాంగ్రెస్ నాయకులు తామ నాయకుడు తీసుకువచ్చాడని గ్రామాలలో కేకులు కట్ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దళిత బందు కింద మండలంలోని ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అందజేస్తామని, ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. అధికారులు తమ ఇళ్లకు వచ్చి విచారణ నిర్వహిస్తారని, ఆ విచారణలో అన్ని వివరాలు చెబుతారని, ఆ వివరాల ప్రకారం ఎవరికి ఇష్టమైన యూనిట్లను వారు ఎంపిక చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా బోనకల్ మండలంలో 20 మందికి కళ్యాణ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో బయ్యారపు అశోక్, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ జమాలుద్దీన్, వివిధ గ్రామాల సర్పంచులు ఆళ్ల పుల్లమ్మ, మర్రి తిరుపతిరావు, కొమ్మినేని ఉపేందర్, బోనకల్ సహకార సంఘం అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, నన్నకు లక్ష్మి, జెర్రిపోతుల రవీంద్ర, ఎంపీటీసీలు కందిమల్ల రాధ, కర్లకుంట దేవమని పాల్గొన్నారు.

## గృహాలక్ష్మీ పథకం... బిఆర్ఎస్ శ్రేణులకే



బోనకల్, అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: గృహాలక్ష్మీ పథకం.. కేవలం బిఆర్ఎస్ శ్రేణులకే... అన్నట్లు మండలంలోని గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక జరిగిందని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు, అర్హులైన లబ్దిదారులకు గృహాలక్ష్మీ పథకం అందని ద్రాక్షగా మారిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు వారి సొంత పార్టీకి చెందిన వారినే ఎంపిక చేసి పేర్లు ప్రకటించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. అధికారులు రాజకీయ ప్రమేయం లేకుండా గ్రామ సభల ద్వారా అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయాలని కోరారు. ఇప్పటికే రూ. 25 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం చేసిన వారికి కూడా గృహాలక్ష్మీ పథకం ఎంపిక చేయడంలో ప్రభుత్వ చిత్తశుద్ధి బహిర్గతమవుతుందన్నారు. గృహాలక్ష్మీ పథకం కేవలం ఎన్నికల స్టంట్ కేసీఆర్ ప్రభుత్వం మార్చిందని, పేదల అభ్యున్నతిపై చిత్తశుద్ధి లేదన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

## 8న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

**ముదిరాజ్ సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చొప్పరి శంకర్**



హైదరాబాద్ ఈరోజు ప్రతినిధి: భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం అందరికి ఓటు వేసే హక్కు ఎలా ఉందో,తమ హక్కుల సాధనకు, తమకు జనాభా దామాషా ప్రకారం అంతే నిష్పత్తిలో వాటాలు ఇచ్చే బాధ్యత రాజకీయ పార్టీ లపై ఉందని,అది సాధించడం కోసం ఈ నెల 8 న పరేడ్ గ్రౌండ్ వేదికగా ముదిరాజ్ ల ఆత్మ గౌరవ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ముదిరాజ్ సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చొప్పరి శంకర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి గొల్ల కరుణాకర్ తో కలిసి ఆయన మహాసభ గోడ పత్రిక ను ఆవిష్కరించారు.బీసీ లలో అధిక జనాభా ఉన్న ముదిరాజ్ లకు ఇప్పటికే ఒక్క సీటు కేటాయించకుండా అధికార పార్టీ మొండి చెయ్యి చూపిందని రానున్న ఎన్నికలలో మిగతా పార్టీ లలో ఏ పార్టీ ముదిరాజ్ లకు ఎక్కువ సీట్లు కేటాయిస్తారో వారికే తమ మద్దత్తు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ లు ఈ మహాసభలో పాల్గొవాలని, పిలిస్తే రావడం కాదు తెలిస్తే రావాలి అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ముదిరాజ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో వంద పడకల ఆసుపత్రి



మేడిపల్లి, అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి కృషి ఫలితంతో ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా దాదాపు 6లక్షల జనాభా కలిగిన ఉప్పల్ నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రి కల నేడు సాకారమైంది. ముఖ్యమంత్రి వర్యులకు , వైద్య,ఆరోగ్య శాఖ మంత్రివర్యులకు వినతి పత్రాలను అందజేసి, అసెంబ్లీలో వంద పడకల ఆస్పత్రి కావాలని ఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రజల కోసం అనుక్షణం పరితపించిన ఎమ్మెల్యే కు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఈ నెల 10న భారతీయ ఓ బి సి సమైక్య సమావేశం

**బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ రాములు...**



హైదరాబాద్ ఈరోజు ప్రతినిధి: పార్లమెంటు సమావేశాలల్లో చర్చించి ఓబీసీ బిల్లుకు చట్ట బద్దత కల్పించాలని కోరుతూ 10 వ తేదీన భారతీయ ఓ బి సి సమైక్య సమావేశం నిర్వహించనున్నట్లు భారతీయ ఓ బి సి సమైక్య బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ రాములు అన్నారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో భారతీయ ఓబీసీ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కె. కోటేశ్వరరావు తో కలిసి పాల్గొన్నారు. ఢిల్లీ,హర్యానా,పంజాబ్ రాష్ట్రాలలో పర్యటన వియవంతంగా జరిగిందని భారతీయ ఓ బి సి సమైక్య జాతీయ అధ్యక్షులు కోటేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమ అభిప్రాయాన్ని మార్చుకొని ఓ బి సి జన గణన లెక్కలు చేసే విధానానికి సానుకూలంగా స్పందించిందన్నారు. అలాగే వివిధ పార్టీల వారు కూడా బీసీ కుల గణన చేయాలని తాను చేసిన సిఫార్సు కు మద్దతు పలికారనిఉదాహరణకు బీహార్లో జరిగిన లెక్కల్లో 63 శాతం ఓబీసీ ఉన్నారని మిగతా 28 రాష్ట్రాల్లో కూడా ఓబీసీల జనాభా లెక్కలు జరిగితే పరిపాలన సులభంగా మారుతుందని అగ్రవర్ణాలకు భయపడి వారి ఓటు బ్యాంకును కోల్పోతామని కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం విచారకరమని ఆయన అన్నారు. తాము కేంద్ర మంత్రులు రాందాస్ అథవలే,గంగారంలను తదితరులను కలిసి 27 శాతం ఓబీసీలకు, 50 శాతం మహిళలకు అందులో 33 శాతం ఓబిసి మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామనన్నారు. ప్రతీ పార్టీ ని మరొక సారి కలిసి పార్లమెంట్ లో బిల్లుకు మద్దత్తు పలుకుతామని లిఖిత పూర్వక హామీని తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సత్తార్ సాహెబ్,డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్య రిటైడ్ ఐఏఎస్,పురుషోత్తం,అబ్దుల్ వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ బావిలో నీళ్లు అధ్వానం, పట్టించుకోని అధికారులు

**మురికి నీళ్లనే వాడుతున్న గ్రామ ప్రజలు**

**నీళ్లను శుద్ధి చేసే పంచాయతీ అధికారులు లేరా అంటూ ప్రజల మండిపాటు**

**ప్రజల బాధలు పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి**





బోనకల్, అక్టోబర్ 3ఈరోజు ప్రతినిధి: ప్రజలు వాడుకునే పురాతన కాలం బావిలో నీళ్లు అద్వానంగా మారి చెత్తాచెదారంతో నిండి ఉన్నది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి వెనక ఉన్న పురాతన కాలం బావి నిత్యం ప్రజలకు ఉపయోగపడుతుంది. 1956లో ఆనాటి గ్రామ పెద్దలు బొమ్మ కంటి సత్యనారాయణ మధిర నియోజకవర్గ శాసనసభ్యులుగా ఉన్నప్పుడు ఈ బావిని నిర్మించాడు. ఈ భావి వయసు సుమారు 67 సంవత్సరాలు ఉంటుంది. ఇలాంటి బావులు గ్రామంలో 10 వరకు ఉన్నాయి. నిత్యం ప్రజల కొరకు ఉపయోగపడే బావులు ఇవి. కానీ ఆ బావుల్లో నీళ్లు చూస్తే అధ్వానంగా ఉన్నాయి. బావి చుట్టూ చెత్తాచెదారం ముళ్ళకంచెలు పెరిగి అడవిని తలపిస్తుంది. అయినా సరే ఇప్పటికి కూడా ఆ బావికి చుట్టూ మోటార్లు పెట్టుకుని నీళ్లను వాడుకుంటున్నారు. వాడుకునే నీళ్లను ప్రజల కోసం శుద్ధి చేసే పంచాయితీ అధికారులు కరువయ్యారు. అసలే డెంగ్యూ మలేరియా సీజనల్ వ్యాధుల కాలం ఆ బావిలో నీళ్లు వాడుట వలన చుట్టుపక్కల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం మెండుగా కనిపిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నడైన గ్రామపంచాయతీ అధికారులు ఆ బావి చుట్టూ చెత్తను తొలగించలేదు. పిరికేడు బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు గ్రామపంచాయతీ అధికారులు ఉన్నారా లేరా అనే విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రమై ఉండి కూడా పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నాడని గ్రామంలో చర్చించుకుంటున్నారు. ఎందుకు ఈ పంచాయతీ కార్యదర్శి కి ఇంత నిర్లక్ష్యము అంటూ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు అంటున్నారు.

## జిల్లా స్థాయి క్రీడా పోటీలకు లూర్దు మాత విద్యార్థులు ఎంపిక..



తల్లాడ, అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: తల్లాడ లూర్దు మాత విద్యాలయం విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జస్సింత మేరీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏన్కూరు లో జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో తమ పిల్లలు అత్యుత్తమ ప్రతిభ చాటారని ముఖ్యంగా సీనియర్స్ వాలీబాల్ విభాగంలో ఎస్ అక్షయ బాబు, టి మణిబాబు, సిహెచ్ భార్గవ్ ,అండర్ 14 విభాగంలో అబ్బాయిల విభాగంలో లూర్దురెడ్డి, అండర్ 14 ఖోఖో అమ్మాయిలో నందిని అండర్ 17 అమ్మాయిలు దీపిక, అండర్ 17 అబ్బాయిలలో రణధీర్, పార్ధు, కృష్ణకుమార్ అదేవిధంగా రన్నింగ్ లో భార్గవ్ ఎంపికైనట్లు ఆమె తెలిపారు ఈ యొక్క గొప్ప ఘనత మా పాఠశాలకి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిఈటి చలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నియోజవర్గ లబ్ధిదారులకు గృహలక్ష్మీ మంజూరు పత్రాలను పంపిణీ చేసిన జెడ్పీ చైర్మన్



మధిర రూరల్ అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలో స్థానిక రెడ్డి గార్డెన్ ఏర్పాటు చేసిన గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ చేసిన జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిపాల్గొన్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని, పేదల కల సాకారం చేసే ఆపద్బాంధవుడని జిల్లా పరిషత్ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజు అన్నారు అనంతరం మున్సిపాలిటీ మండల లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం క్రింద మంజూరైన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎర్రుపాలెం మండల లబ్ధిదారులకు ఎర్రుపాలెం రైతువేదికలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ కమల్ రాజు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల్లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఎన్నో ఏండ్ల నాటి పేదల కలలను సీఎం కేసీఆర్ గారు సాకారం చేశారని, పేదలకు స్థలాలు క్రమబద్ధీకరణ చేయడం గొప్ప విషయమని చెప్పారు. పేదలకు పట్టాలు ఇవ్వడంతో వారిలో ధైర్యం పెరిగిందన్నారు. దీంతో పాటు సొంత జాగా ఉన్న పేదలకు గృహలక్ష్మి పథకంతో పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటి కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారు చెప్పారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణ చేసుకుని ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఆ స్థలం వారికే చెందే విధంగా ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బి ఆర్ఎస్ ప్రభుత్వం ను కాపాడుకొని నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అధికారులు గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం




బోనకల్ అక్టోబర్ ఈరోజు ప్రతినిధి: వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మంగళవారం స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో కొండా నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బంధం శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వా%శీ% పేదలకు ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం గాని, బీసీ బందు పథకం గాని, రైతు బంధు పథకం గాని గ్రామసభలలో ఎంపిక చేసి అర్హులైన పేదలను గుర్తించి ఇవ్వవలసినదిగా మండల కమిటీ డిమాండ్ చేసింది. అలా కాకుండా అధికార పార్టీ నాయకులకు, కండువాలు కప్పించుకుంటేనే వారికి ఇస్తామన్న ఎడల సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేయవలసి ఉంటుంది.... ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఉప్పర శ్రీను , సుగంధ వెంకటనారాయణ ,కొమ్మినేని శేషగిరి, గరిపాకల దుర్గ నరసింహారావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు




అశ్వారావుపేట నియోజకవర్గ ఈరోజు (ప్రతినిధి: ) అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలంలోని పలు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే మచ్చా నాగేశ్వరరావు. దమ్మపేట మండలంలోని మండలం లోని గున్నేపల్లి, ముకుందాపురం, తొట్టి పంపు, మొద్దుల గూడెం మొద్దులగూడెం, వడ్లగూడెం , అల్లిపల్లి, మారప్పగూడెం ,మల్కారం, పెద్ద గొల్లగూడెం, దమ్మపేట, మందలపల్లి, ముష్టిబండ గ్రామాలలో పలు సిసి రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమానికి అడుగడుగునా పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో ఎమ్మెల్యేని సన్మానం చేసి డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి దమ్మపేట అశ్వారావుపేట టిఆర్ఎస్ శ్రేణులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని 200 బైకులు 80 కార్లతో ర్యాలీ నిర్వహించారు. దమ్మపేట జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, వైస్ సర్పంచ్ యుగంధర్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు రావు రావు జోగేశ్వరరావు, దొడ్డాకల రాజేశ్వరరావు, మందపాటి రాజమోహన్ రెడ్డి, పైడి సాయి, టిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాష్, అశ్వారావుపేట టౌన్ ప్రెసిడెంట్ ఎస్ సంపూర్ణ కలపాల శ్రీను, చిప్పనపల్లి శ్రీను, జుజ్జారపు రాంబాబు, గంధం ఆనంద్, టి హరి, జె శ్రీరామ్ మూర్తి, మహేష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గృహలక్ష్మి పట్టాలను పంపిణీ చేసిన లింగాల



ఎర్రుపాలెం అక్టోబర్ 3ఈరోజు ప్రతినిధి: జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మంగళవారంఎర్రుపాలెంరైతు వేదికలోనిర్వహించినకార్యక్రమంలో గృహలక్ష్మి పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేశారు అనంతరం మాట్లాడుతూ ఇల్లు కట్టుకొలేని నిరుపేదలకు కూడు గుడ్డ గూడు లేక అల్లాడుతున్న పేద బడుగు బలహీన వర్గాలకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్ల స్థలాలు ఉన్న లబ్ధిదారులకు మూడు లక్షల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు రేమిడిచర్ల కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నందున డబల్ బెడ్ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరిగిందని ప్రభుత్వ స్థలాలులేనందువలన సొంత జాగా కలిగిన లబ్ధిదారులకు మూడు లక్షల రూపాయలను ప్రభుత్వం అందజేస్తుందని దీనిపై ఎలాంటి అవకతవకల అవకాశం లేకుండాగా నేరుగా మీ ఖాతాలోకిడబ్బులుపడతాయని వివరించారు బేస్ మెంట్కు లక్ష స్లాబ్ వరకువచ్చినతర్వాత లక్ష ఇల్లు పూర్తి చేసి సున్నం వేసిన తర్వాతలక్షరూపాయలు మీ బ్యాంక్ ఖాతాలోకి చేరతాయని చెప్పారు ఈ పథకాల పైఅనేకఅనుమానాలు ఉన్నాయనిఎన్నికలసమీపిస్తున్న తరుణంలోఏమైనా ఆటంకాలు కలుగుతాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అలాంటి వాటిని నమ్మొద్దని కరోనా సమయంలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగాయని అప్పుడు ఏమైనా ఆటంకాలు ఎదురయ్యా యా అప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు ఎందుకు వస్తాయని మీరు ధైర్యంగా మీ పనులు కొనసాగించుకోవచ్చని సూచించారు నమిలిన వాడికంటే కంటే మింగిన వాడి వేలన్న చందంగా ఇప్పటికే పథకాలను ప్రవేశపెట్టినందువలనపనులుత్వరగాజరుగుతాయని మీరు వెంటనే ఇంటినిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేసి గృహలక్ష్మి మిఇంట్లో తాండవించాలని ఇలాంటిబృహత్తరకార్యక్రమాలు చేసిన పేదల పాలిట పెన్నిధి మన కేసీఆర్ అని మీరందరూ కూడా కేసీఆర్ నీ మరొక్కసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరుతున్నామన్నారు ఈకార్యక్రమంలో రాష్ట్ర విత్తనాలు అభివృద్ధి చైర్మన్ కొండబాలకోటేశ్వరరావు మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావు ఎంపీడీవో శ్రీనివాసరావు మండల ఎంపిపి దేవరకొండ శిరీష జడ్పిటిసి శీలం కవిత వైస్ ఎంపీపీ సూరపనేని రామ కోటేశ్వరావు ఏఎంసీ మాజీ చైర్మన్ చావ రామకృష్ణ మండల అధ్యక్షులు పంబిసాంబశివరావు కార్యదర్శి శ్రీనివాసరెడ్డి సర్పంచి మొగిలి అప్పారావు ఎంపీటీసీ షేక్ మస్తాన్ వలి పెద్ద గోపవరం ఎంపీటీసీ కిషోర్ బాబు వివిధ గ్రామ సర్పంచులు కార్యదర్శులు ఎంపీటీసీలు తదితరులు నాయకులు పాల్గొన్నారు

## ఆత్కూర్ఆంజనేయ స్వామి దేవాలయంలో అన్నదానం



మధిర రూరల్ అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: మండలం పరిధిలో ఆత్కూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో అన్నదానికార్యక్రమం నిర్వహించిన ప్రతి మంగళవారం జరిగే అన్నదాన కార్యక్రమం తాతలిబెజవాడ రవి పేరు పై అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన అభిమానులు ఇటీవల అనారోగ్యంకి గురైన బెజవాడ రవి ఆరోగ్యం బాగుండాలని , ఆంజనేయస్వామి గుడివద్ద వారి అభిమానులు బెజవాడ రవి అనసూయ దంపతుల తాతలు అన్నదానం నిర్వహించారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి మంగళవారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి పూర్ణ, దాల్ కృష్ణ, రవి అభిమానులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మారెడ్డి



మేడిపల్లి, అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: ఉప్పల్ నియోజకవర్గంలోని ఉద్యమకారులకు, నాయకులకు, నాయకురాలు, కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రామంతాపూర్లోని పూనం భవన్ ఫంక్షన్ హాల్లో జరిగిన రామంతాపూర్ డివిజన్ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పాల్గొని డివిజన్ ముఖ్యనాయకులు, ఉద్యమకారులు,కార్యకర్తలతో మాట్లాడి వారి ప్రధాన సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగాలక్ష్మారెడ్డి మాట్లాడుతూప్రతి ఉద్యమకారునికి, నాయకులకు, నాయకురాలకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని,మీ సమస్య ఎలాంటిదైనా కుడా తమ దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత త్వరగా అ సమస్యలను పరిష్కరిస్తానని,మీరు ఈ రెండు నెలలు నాకు సపోర్టుగా పనిచేస్తే వచ్చే ఐదేళ్లు మీకు సేవకుడిగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడూరి శ్రీనివాస్ ఎంబీసీ మాజీ చైర్మన్ ,గంధం జోత్స్నా నాగేశ్వరావు మాజీ కార్పొరేటర్ ,గొల్లూరి అంజన్న మాజీ కార్పొరేటర్ ,డిటి మల్లయ్య రాష్ట్ర మత్స శాఖ వైస్ చైర్మన్ ,ముస్తాక్ డివిజన్ ప్రెసిడెంట్,షాగ రవి వారితో పాటుగా ముఖ్యనాయకులు ,ఉద్యమకారులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావు



మేడిపల్లి, అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: రామంతాపూర్ డివిజన్లో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు ప్రజలకు సూచించారు. డివిజన్లోని ఆర్టీసీ కాలనీ బృందావనం పార్క్ వద్ద, అయ్యప్ప స్వామి గుడి ప్రక్కన గుర్తుతెలియని వ్యక్తులు చెత్త కుప్పలు వేస్తున్నారని కాలనీవాసులు కార్పొరేటర్ కు తెలుపగా, వెంటనే కార్పొరేటర్ స్పందించి డీఇ చందన, శానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్ మరియు వారి సిబ్బందిని పిలిపించి ఆ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి ఎక్కడైతే చెత్త వేస్తున్నారో అక్కడ మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దయచేసి ఎవ్వరు కూడా చెత్త బయట వేయరాదని మీ ఇంటి ముందరకే వస్తున్నటువంటి రిక్షా వారికి మీ ఇంట్లో ఉన్న చెత్తను వాళ్లకు ఇవ్వాలని, ప్రస్తుతం విష జ్వరాలు మరియు డెంగీ తో చాలామంది బాధపడుతున్నారని కావున ప్రతి ఒక్కరూ మీ ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు నాసు సతీష్, నగేష్ గుప్తా, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడానికి చేతకాకనే గృహలక్ష్మి పథకం అని కొత్త నాటకానికి తెర తీసిన కెసిఆర్



మధిర అక్టోబర్ 3ఈరోజు ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సమావేశంలో మాట్లాడుతూ9 సంవత్సరాల పాలనలో గుర్తురాని ఇళ్ల పథకం ఎలక్షన్ ముందు కేసిఆర్ కి గుర్తొచ్చిందా ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసురంశెట్టి కిషోర్లి మాట్లాడుతూ.కేసీఆర్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం ఎలక్షన్ల మేనిఫెస్టోలో గృహ నిర్మాణానికి మూడు లక్షల ఇస్తా అని చెప్పి ఇవ్వకుండా ఎలక్షన్ ముందు ఇవ్వడంలో మతలబు ఏంటి అని ప్రశ్నించారు.. ఆర్భాటంగా ఇస్తున్నారు ఇవి వచ్చేవేనా? హౌసింగ్ డిపార్ట్మెంట్ లేకుండా చేశారు ఈ గృహలక్ష్మి ఇళ్ల డబ్బులు ఎవరు ఇస్తారు.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఐదు లక్షలతో ఇల్లు ఇస్తామని ప్రకటన వెలువడిన వెంటనే అది తట్టుకోలేక తూతూ మంత్రంగా ఈరోజు గృహలక్ష్మి పేరుతో పత్రాలు మంజూరు చేశారు.. అవి ఇంట్లో ఫ్రేమ్ కట్టించుకోవటానికి తప్ప దేనికి ఉపయోగపడవు, గృహలక్ష్మి ఇల్లు ఒక్కొక్క మండలానికి 3,000 మంది అప్లై చేసుకుంటే 450 ఇల్లు ఇచ్చి మమ అనిపించారు, ఇవన్నీ ఎలక్షన్ జిమ్మిక్కులే.. లేకుంటే నెలరోజుల ముందు గుర్తొచ్చిందా.. 9 సంవత్సరాలుగా పేదలకు ఇల్లు ఇవ్వకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేస్తుంది ఇదంతా ప్రజలు గమనిస్తున్నారు.. గృహలక్ష్మి పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు అందరు మీకు ఆ పత్రాలు అందించిన నాయకులకు ముందు ఇల్లు కట్టుకోవటానికి పెట్టుబడి పెట్టమని చెప్పండి. తర్వాత ఆ బిల్లును వాళ్ళను తీసుకోమని చెప్పండి అప్పుడు తెలుస్తుంది వాళ్లకు గృహలక్ష్మి బిల్లు వచ్చేది రానిది.. కాంగ్రెస్ ప్రభుత్వంలో కిరణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉండగా కొన్ని ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటే ఫైనల్ బిల్ సమయములో ఎలక్షన్ కోడ్ వస్తే ఇదే బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలుగా పెండింగ్ బిల్లు ఇవ్వలేదు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడానికి చేతకాకనే గృహలక్ష్మి పథకం అని కొత్త నాటకానికి కేసీఆర్ తెరతీశాడని, తొమ్మిది సంవత్సరాలుగా పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తానని చెప్పి మోసం చేసి ఇప్పుడు కొత్తగా గృహలక్ష్మి పథకం అని పేదల బతుకులతో కెసిఆర్ ప్రభుత్వం ఆడుకుంటుందని అన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అడిగిన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని నేటికి ఏ ఊరు వెళ్ళిన ఇందిరమ్మ ఇల్లే కనిపిస్తాయి అని అన్నారు. ఇప్పుడు ఎలక్షన్ ముందు ఆర్భాటంగా ఎలా మంజూరు పత్రాలు ఇస్తారని కాంగ్రెస్ పార్టీ తరపున ప్రశ్నించారు. ఇది కేవలం ఎలక్షన్ల కోసం కేసీఆర్ ఆడుతున్న నాటకం అని వారు తెలిపారు ఈ కార్యక్రమంలోదారా బాలరాజులి లితూమాటి నవీన్ రెడ్డిలి లిచిలువేరు బుచ్చి రామయ్యలి లిషేక్ బాజీలి లిషేక్ జహంగీర్లి లిపారుపల్లి విజయ్ కుమార్లి లినిడమనూరి వంశీకృష్ణలి లిబొల్లెద్దు రాజేంద్ర, ఆదిమూలం శ్రీనివాసరావు షేక్ గౌసుద్దీన్లి మొదలగువారు పాల్గొన్నారు.

## అతి తక్కువ ఐఆర్ ప్రకటన పట్ల యుయస్పిసి నిరసనలు



ఎర్రుపాలెంఅక్టోబర్3 ఈరోజు ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితవైఖరిఉపాధ్యాయ, ఉద్యోగసంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగాకేవలం 5%మధ్యంతర భృతి ప్రకటించటాన్ని యుయస్పిసి తీవ్రంగాఖండించింది. మంగళవారం ఎర్రుపాలెం మండలంలోనిఅన్నిపాఠశాలలో అతి తక్కువ ఐఆర్ ప్రకటన పట్ల నిరసిస్తూ నలబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసనలు చేపట్టారుదానిలో భాగంగానే జెడ్ పి ఎస్ ఎస్ మామునూరు లో నిరసన కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంఘాలను ఎవరిని సంప్రదించకుండా అతి తక్కువ ఐ ఆర్ ప్రకటించడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు పెండింగ్ఉన్నటువంటి డీఏ లని కూడా వెంటనే ప్రకటించాలని ఐఆర్ 20 శాతం తగ్గకుండా ప్రకటించాలని పెండింగ్ బిల్లులు వెంటనే ముంజూరు చేయాలని డిమాండ్ చేశారుకార్యక్రమంలో వివిధ పాఠశాలలోయుయస్పీసి భాగస్వామ్య సంఘాల సభ్యులు,ఉపాధ్యాయులందరూ స్వచ్ఛందంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు ఈ కార్యక్రమంలో బండారు నాగరాజు మామునూరు హెచ్ఎం శాంత బాబు రాజారావు సత్యనారాయణ రాము జగదీష్ సునీత రమాదేవి నరసింహారావు బద్రు సతీష్ జమలయ యు యస్పిసి మండల స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## సొంతింటి కలను నిజం చేసిన సీఎం కేసీఆర్ కు ధన్యవాదాలు: మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి



మధిర, అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలోరెడ్డి గార్డెన్లో 22 వార్డులకు జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు మూడు లక్షల రూపాయలు పంపిణి చేయుటకు గృహ లక్ష్మీ పథకం కింద పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. మడుపల్లి ఐదో వార్డులోని 22 మంది లబ్ధిదారులకు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ విద్యాలత వెంకట్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు శీలం వెంకట్ రెడ్డి, ఐదో వార్డ్ బిఆర్ఎస్ ఇన్చార్జి వాయు పుత్ర వెంకట్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. లబ్ధిదారులంతా మన ప్రియతమ ముఖ్యమంత్రి కేసీఆర్ కి మంజూరు చేయించిన లింగాల కమల్ రాజు కి కృతజ్ఞతలు ప్రకటించారు ఈ కార్యక్రమంలో యేసు పోగు దేవా, కనకపుడి కొండ, కంభం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పట్టాలు పంపిణీ



మధిర అక్టోబర్3 ఈరోజు ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలో స్థానిక రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్ ఏర్పాటుచేసిన గృహలక్ష్మి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పేద ఇంటి మహిళల కల నెరవేరిన వేళ.గృహలక్ష్మి పట్టాలు పొందిన మహిళల్లో వెల్లివిరిసిన ఆనందాలు సొసైటీ అధ్యక్షులు బిక్కి ప్రసాద్ కౌన్సిలర్ బిక్కి అనిత కోరారు. ఈ సందర్భంగా బి క్కీ ప్రసాద్ దంపతులు మాట్లాడుతూముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం పేదల కల నెరవేరిందని గృహలక్ష్మి పట్టాలు పొందిన మహిళల్లో ఆనందాలు వెలివేరిచాయని సొసైటీ అధ్యక్షులు మధిర సొసైటీ అధ్యక్షులు, 13 వార్డు కౌన్సిలర్ బిక్కి ప్రసాద్ అనిత దంపతులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని రానున్న ఎన్నికల్లో మధిర బి ఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజుని గెలిపించాలని సహకార సంఘం అధ్యక్షులు కౌన్సిలర్ బిక్కీ ప్రసాద్ అనిత దంపతులు కోరారు. మధిర 13వ వార్డులో గృహలక్ష్మి పథకంకి ఎంపికైన లబ్ధిదారులను మున్సిపల్ చైర్ పర్సన్ మొండి తోక లతా వైస్ చైర్మన్ విద్యాలత కమిషనర్ రమాదేవితో కలిసి వారు అభినందించారు.

## పేదలకు సొంత ఇల్లు నిర్మించటమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం



మధిర రూరల్ అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: మండలం పరిధిలో జాలిముడి రామచంద్రపురంబిఆర్ఎస్ మండల సెక్రెటరీ బొగ్గుల భాస్కర్ రెడ్డి మరియు శీలం కృష్ణారెడ్డి రామచంద్రపురం సర్పంచ్ మారుత నరసింహారావు సెక్రటరీ వేముల నాగేశ్వరావు చేతులమీదుగా లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో మండల సెక్రటరీ బొగ్గులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూపేద ప్రజలకు సొంతిల్లు ఉండాలని ప్రధానమైన లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని గృహలక్ష్మి పథకం ద్వారా జాలిముడి మరియు రామచంద్రాపురం గ్రామాలలో ఎంపికైన లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి ఆశీర్వదించాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు సహకారంతో గృహలక్ష్మి పథకం ద్వారా సొంత స్థలం కలిగిన వారందరికీ ఇల్లు నిర్మించేందుకు 3 లక్షల రూపాయలు మంజూరు చేయటం జరిగిందని వారు తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద ఎంపికైన పేదలందరూ తక్షణమే గృహాలు నిర్మించేందుకు శంకుస్థాపన చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగశెట్టి కోటేశ్వరావు బి ఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావూరి శ్రీను లబ్ధిదారులు పాల్గొన్నారు

## ఎస్సీ ఎస్టీ వాళ్లకి 200 యూనిట్లు ఉచితంగా అందివ్వాలని విద్యుత్ అధికారులకు మెమోరాండం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: తుర్కయంజాల్ మున్సిపాలిటి రాగన్న విద్యుత్ కార్యాలయం దగ్గర కుల వివక్ష వ్యతిరేక పోరాటసంఘం ఆధ్వర్యంలో. 101 యూనిట్ల నుండి.200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఎస్సీ ఎస్టీ వాళ్లకి ఇవ్వాలని.కెపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కర్రత్ అదేవిధంగా కెపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లూరి భాస్కర్ అన్నారు.అనంతరం కరెంట్ ఆఫీస్ దగ్గర ధర్నా. నిరసన చేయడం జరిగింది. అనంతరం ఏఈ గారితో కలిసి మెమోరాండం ఇచ్చి జీవో నెంబర్. 342 ప్రకారం ఎస్టి ఎస్సీ వాళ్లకి ఉచిత విద్యుత్తు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కెవిపిఎస్ మండల నాయకులు కెంసారం సత్యనారాయణ, బి మాలాద్రి, కే కుమార్, కే ఆదామ్, కే. రాజు, గ్రామ కమిటీ సభ్యులు దావీదు తదితరులు పాల్గొన్నారు.

## పేది ఇంటి ఆడపడుచుకు వివాహానికి ఆర్థిక సహాయం చేసిన మనుసు ఉన్న మారాజు



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 3 ఈరోజు ప్రతినిధి: ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి లో మంగళపల్లి చెందిన మహ్మద్ ఖాజా పాష కూతురు వివాహానికి 10,000 రూ. ఆర్థిక సాయం చేసిన ఇబ్రహీంపట్నం యువ నాయకులు జెర్కోని రాజు కార్యక్రమంలో మహేష్ చారి ,దయ చారి,సోప్పరి కర్ణకర్ ,జలంధర్, చెనమోని శివ ప్రసాద్ , యాచారం సురేష్ , చెనమోని భాస్కర్ , జైపాల్, శ్రవన్ ,యాట శివ ,రవిందర్, శివ కుమార్,అజిత్,పాల్గొన్నారు.

# వచ్చేది డైనోసార్ ధనుష్.. రిస్క్ వద్దు!

ఈ ఏడాది మిగిలిపోయిన మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో ప్రభాస్ సలార్ – షారుక్ డంకీ. డిసెంబర్ మూడో వారంలో ఇవి రిలీజ్‌కు రెడీగా ఉన్నాయి. సినీ ప్రియుల దృష్టంతా ఈ రెండు చిత్రాల మీదే ఉంది. దీంతో ఈ రెండు చిత్రాలకు అటు ఇటు కొద్ది రోజుల వరకు ఏ సినిమాలు వచ్చేందుకు సాహసం చేయవు! కానీ ధనుశ్ పాన్ ఇండియా మూవీ కెప్టెన్ మిల్లర్ మాత్రం విడుదల సాహసానికి సిద్ధంగా ఉంది. డిసెంబర్ 15న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. వాస్తవానికి ఈ చిత్రం విడుదల తేదీని ఎప్పుడో అనౌన్స్ చేశారు. అప్పటికీ షారుఖ్ ఖాన్ డంకీ మాత్రమే డిసెంబర్ రిలీజ్‌కు కన్ఫార్మ్ అయ్యింది. బాలీవుడ్ చిత్రం కావడంతో మిల్లర్ మేకర్స్.. పెద్ద పోటీగా భావించలేదు. కానీ



ఇప్పుడు పరిస్థితి అలా లేదు. అనూహ్యంగా సలార్ వచ్చి డిసెంబర్ మూడో వారానికి చేరింది. పైగా రీసెంట్‌గానే జవాన్‌తో మరో రూ.1000కోట్ల హిట్‌ను అందుకున్నారు షారుక్. అంటే ఇప్పుడు సలార్ – డంకీకి విపరీతమైన క్రేజ్ నెలకొని ఉంది. మరి ఇలాంటి సమయంలో కేవలం వారం రోజుల వ్యవధిలో ముందుగా వచ్చి.. మిల్లర్.. పైసా వసూలు చేయడం సాధ్యమేనా అంటే చెప్పడం కాస్త కష్టమే. గతంలో... 2018 డిసెంబర్‌లో ధనుశ్ 'మారి 2' రిలీజ్ చేసినప్పుడు.. అప్పుడు పోటీగా.. షారుక్ ఖాన్ జీరో, యష్ కేజీయఫ్ ఛాప్టర్ 1, మోహన్ లాల్ ఒడియన్, అక్వమెన్ వంటివి ఉన్నాయి. అయినా కూడా 'మారి 2' కమర్షియల్‌గా మంచి సక్సెస్‌ను అందుకుంది. ఇప్పుడు కూడా అలాంటి సీన్ రిపీట్ అవుతుందనే ధీమాతో సినిమా రిలీజ్ చేస్తే.. కష్టమే! ఎందుకంటే ఈ సారి పోటీగా వచ్చేది డైనోసార్. తక్కువ అంచనా వేయలం. కాబట్టి.. మిల్లర్ ఫైనల్ డెసిషన్ చాలా క్యాలికులేషన్లపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఢీ కొట్టేందుకు రెడీ అయిందా.. తమిళంలో ఓకే కానీ ఇతర భాషల్లో కష్టాలు తప్పవు. ఇకపోతే ఈ పీరియాడిక్ డ్రామాలో ప్రియాంకా మోహన్ హీరోయిన్, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే రిలీజైన టీజర్ ఆకట్టుకుంది.

## గోపీచంద్ సినిమాలో స్పెషల్ ట్రాక్



యాక్షన్ హీరో గోపీచంద్ హీరోగా దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ మూవీ చేసేందుకు సిద్ధం అయిన సంగతి తెలిసిందే. అయితే, ఈ సినిమాలో ఓ స్పెషల్ కామెడీ ట్రాక్ ఉంది. ఇప్పుడు ఈ ట్రాక్ కోసం ఓ భారీ సెట్ ను వేయడానికి ప్లాన్ చేస్తున్నారు. మరి శ్రీనువైట్ల, గోపీచంద్ తో ఏ రేంజ్ లో కామెడీ ట్రాక్ ను డ్రైవ్ చేస్తాడో చూడాలి. అన్నట్టు సినిమాలో గోపీచంద్ గెటప్ అండ్ సెటప్ చాలా థ్రిల్లింగ్ గా ఉంటుందని తెలుస్తోంది. ఇక ఈ మూవీని చిత్రాలయం స్టూడియోస్ సంస్థ పై ప్రొడక్షన్ నెంబర్ వన్ గా వేణు దోనేపూడి ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఇంకా ఇతర నటీనటులు సాంకేతిక నిపుణుల వివరాలను ప్రకటించాల్సి ఉంది. అన్నట్టు ఈ మూవీకి విశ్వం అనే టైటిల్ ని యూనిట్ పరిశీలసిస్తోందట. స్క్రిప్ట్ కి తగ్గట్లుగా ఈ టైటిల్ సరిపోతుందని అంటున్నారు.

## నితిన్ పాత్ర పై ఫన్నీ ఫ్లాష్ బ్యాక్





'ఛలో 'భీష్మ సినిమాలతో తన ఖాతాలో భారీ విజయాలను నమోదు చేసుకున్న వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ హీరోగా ప్రస్తుతం మరో సినిమా వస్తోంది. ఈ సినిమాకి సంబంధించి ఇప్పుడు ఓ ఇంట్రెస్టింగ్ గాసిప్ వినిపిస్తోంది. నితిన్ క్యారెక్టర్ పాయింట్ ఆఫ్ వ్యూలో సాగే ఫ్లాష్ బ్యాక్ చాలా ఫన్నీగా ఉంటుందని.. గత అనుభవాల రీత్యా ప్రేమ పై భయాన్ని పెంచుకున్న హీరో.. ఆ భయాన్ని కనబడకుండా దాచడానికి చేసే ప్రయత్నాలు కూడా ఫన్నీగా ఉంటాయని తెలుస్తోంది.మొత్తానికి మరో కొత్త కథతో నితిన్ – వెంకీ కుడుముల ఎంటర్ టైన్ చేయబోతున్నారు. ఇక ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ భారీ తారాగణంతో భారీ స్థాయిలో నిర్మించబోతుంది. ఎలాగూ భీష్మ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీ వసూళ్ళను సాంధించి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. దాంతో వెంకీ కుడుముల తర్వాత సినిమా పై ప్రేక్షకుల్లో కూడా బాగా ఆసక్తి ఏర్పడింది. మొత్తానికి ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా వచ్చేలా ఉంది.

## 'యానిమల్'క్రేజ్ తో రష్మిక పెంచేసిందా..?




నేషనల్ క్రష్ బ్యూటీ రష్మిక మందన్న క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందులోనూ సోషల్ మీడియా లో భారీ ఫాలోయింగ్ ఉన్న నటి. తనదైన శైలి చమత్కారలతో జనాల్ని ఆకర్షించడంలో అమ్మడి దగ్గర ఉన్న టెక్నిక్ లే మరే నటి దగ్గరా లేవంటే అతిశయోక్తి కాదు. వెండి తెర గొప్ప పెర్ఫార్మర్ మాత్రమే కాదు అంతకు మంచి తనదైన శైలిలో ఎదుట వారిని ఆకర్షించుకోవడంలో తనదమైన ముద్ర కనిపిస్తుంది. అందుకే సోషల్ మీడియాలో అంత ఫాలోయింగ్ ఉన్న నటి అయింది. ఇక కెరీర్ పరంగా టాలీవుడ్ టూ బాలీవుడ్ దూసుకుపోతుంది. పుష్ప తో పాన్ ఇండియా క్రేజ్ ని ఆస్వాదిస్తోంది. యానిమల్ కూడా హిట్ అయితే అమ్మడి రేంజ్ టచ్ చేయని స్థాయికి రీచ్ అవుతుందని అంచనాలున్నాయి. మరి ఈ బ్యూటీ ఒక్కో సినిమాకి ఎంత ఛార్జ్ చేస్తుంది అంటే ఇంతవరకూ మూడు కోట్లు అని వినిపించింది. తాజాగా అమ్మడు మరో కోటి పెంచి నాలుగు కోట్లు పారితోషికంగా తీసుకుంటుందన్న విషయం లీకైంది. ఈ కోటి పెపకం అన్నది ఈ మద్యనే జరిగినట్లు తెలుస్తోంది. పుష్ప రిలీజ్ అనంతరం రష్మిక హైక్ చేస్తుందని ప్రచారం సాగిందిగానీ..అందులో క్లారిటీ లేదు. అయితే తాజాగా ఆమె అమ్మడి డైరీలో కొత్త రూల్స్ రాసిపెట్టికుందిట. దీనిలో భాగంగానే పారితోషికంలోనూ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. యానిమల్ రిలీజ్ అయి హిట్ అయితే ఆ నెంబర్ కూడా పెంచే అవకాశం ఉందిట. లేదంటే యధావిధిగా నాలుగు కోట్లు తీసుకుంటుంది. ఇక్కడ కోటి పెంచడానికి ఓ కారణం ఉంది. యానిమల్ రిలీజ్ కి ముందే ఇలా చేస్తే! ఈ గ్యాప్ లో కొన్ని ప్రాజెక్ట్ లు లాక్ చేయొచ్చు. వాటి ద్వారా తాను కోట్ చేసిన మొత్తం వస్తుంది. ఒకవేళ సినిమా అటు ఇటూ అయితే బ్యాలెన్స్ గా వెళ్లొచ్చు ! అన్నది అమ్మడి ప్లాన్ గా తెలుస్తోంది. ఇక ఎండార్స్ మెంట్స్ విషయంలో రష్మిక చాలా కాలంగా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తన దగ్గరకువచ్చిన ఏ బ్రాండింగ్ ని విడిచిపెట్టదు. వాటి ద్వారా ఎంతో కొంత ఆదాయం సమకూరుతుందని కమిట్ అవుతుది. ఆ లెక్కన చూస్తే రష్మిక మందన్న నికర విలువ 45 కోట్లు. నివేదికలప్రకారం ఎనిమిది కోట్లు వార్షిక ఆదాయంతో నెలకు 60 లక్షల వరకూ సంపాదిస్తోందని తెలుస్తోంది.

## రూల్స్ రంజాన్ పై ఎన్ని ఆశలో..



కిరణ్ అబ్బవరం హీరోగా హాట్ బ్యూటీ నేహా శెట్టి హీరోయిన్ గా తెరకెక్కిన ప్రేక్షకుల ముందుకి రాబోతోన్న సినిమా రూల్స్ రంజన్. ఇంటరెస్టింగ్ పాయింట్ తో జ్యోతికృష్ణ ఈ చిత్రాన్ని సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. గోపీచంద్ ఆక్సిజన్ తర్వాత జ్యోతికృష్ణ లాంగ్ గ్యాప్ తీసుకొని చేస్తోన్న మూవీ ఇదే కావడం విశేషం. ఇక కిరణ్ అబ్బవరం కెరియర్ లో కూడా కాస్తా హైబడ్జెట్ లోనే మూవీ తెరకెక్కింది. ఇప్పుడు కిరణ్ అబ్బవరంకి రూల్స్ రంజన్ మూవీతో బ్లాక్ బస్టర్ పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజావారు రాణిగారు సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన కిరణ్ అబ్బవరంకి ఆ సినిమా మంచి ఇమేజ్ తీసుకొచ్చింది. దీంతో వరుస అవకాశాలు క్యూ కట్టాయి. ఈ ఏడాది వినరో భాగ్యము విష్ణుకథ మూవీ పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అయితే కమర్షియల్ ఫార్మాట్ లో వచ్చిన మీటర్ మాత్రం డిజాస్టర్ అయ్యింది. ఈ రెండు చిత్రాల తర్వాత ఈ ఏడాది రూల్స్ రంజన్ మూవీతో మరల కిరణ్ థియేటర్స్ లో తన అదృష్టం పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యాడు. ఈ మూవీ అక్టోబర్ 6న థియేటర్స్ లో రిలీజ్ కాబోతోంది. కనీసం రూల్స్ రంజన్ తో అయిన కెరియర్ లో ఒక బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకోవాలని కిరణ్ అబ్బవరం ఎదురుచూస్తున్నారు. చేతినిండా సినిమా అవకాశాలు అయితే ఉన్నాయి. అయితే చెప్పుకోవడానికి కిరణ్ అబ్బవరంకి ఒక సాలిడ్ హిట్ అయితే లేదు. ఇక జ్యోతికృష్ణ కూడా కచ్చితంగా రూల్స్ రంజన్ తో దర్శకుడిగా టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుని క్రియేట్ చేసుకోవాలని అనుకుంటున్నారు.



## "స్కంద 2" పై లేటెస్ట్ క్లారిటీ.!




టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా శ్రీలీల మరియు సాయి మంజ్రేకర్ లు హీరోయిన్ లుగా మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన సాలిడ్ మాస్ యాక్షన్ డ్రామా "స్కంద" కోసం అందరికీ తెలిసిందే. మరి మాస్ అంచనాలు నడుమ వచ్చిన ఈ చిత్రం మాస్ ఆడియెన్స్ ని అయితే మెప్పించింది. ఇక వసూళ్ల పరంగా కూడా రామ్ కెరీర్ లో సాలిడ్ నంబర్స్ ని రిజిస్టర్ చేసిన ఈ చిత్రం ఇంట్రెస్టింగ్ గా సీక్వెల్ ని కూడా మేకర్స్ ఫిక్స్ చేసారు.అయితే క్లైమాక్స్ లోనే రివీల్ చేసిన ఈ అంశంపై లేటెస్ట్ క్లారిటీ అయితే తెలుస్తుంది. ఈ చిత్రానికి ఫైనల్ రన్ ఎలా ఉన్నప్పటికీ బోయపాటి మాత్రం సీక్వెల్ ని రెడీ చేయడం అయితే ఖాయం అట. దీనితో అయితే స్కంద సీక్వెల్ డెఫినెట్ గా రాబోతుంది అని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నాడు అలాగే శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

Edited, Printed Published & Owned by ASVI Media Pvt, Printed at ASVI Media Pvt Ltd, Road no 10 Banajarahills Hyderabad-500080. TS.
And Published at Road no 10 Bnajarahills Hyd-80. ASVI Media RNI TELTEL/2021/55761.